ninadam.in
తెలుగు దినపత్రిక
# నినాదం
నిఖార్సైన జర్నలిజం
గురువారం, ఏప్రిల్ 9, 2026 | సంపుటి - 22 | సంచిక 192 | వెల - 7 | పేజీలు - 12 - 8
Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

### జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్
## భవితవ్యంపై ఉత్కంఠ


- విచారణ జరిపిన హైకోర్టు ధర్మాసనం
- తీర్పు 22కు వాయిదా..



**హైదరాబాద్,ఏప్రిల్ 8(నినాదం):** కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ కమిషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టు తీర్పును ఈ నెల 22కు వాయిదా వేసింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం,

▸▸తరువాయి 2లో..

# 15 రోజుల సీజ్ ఫైర్



## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తాత్కాలిక బ్రేక్

- ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం విరామం ప్రకటించిన ట్రంప్

గత 40 రోజులుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా `ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇరాన్‌పై దాడులను రెండు వారాల పాటు ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ `అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయింది.

- కాల్పుల విరమణతో ప్రపంచ శాంతి
- ఇదో గొప్ప సుదినమన్న ట్రంప్
- తన సొంత సోషల్ మీడియా 'ది ట్రూత్'లో పోస్టులు
- లెబెనాన్ విషయంలో వెనక్కు తగ్గం : ఇజ్రాయెల్
- హర్మూజ్‌పై సుంకాలు విధింపును సమర్థించుకున్న ఇరాన్
- ఇరాన్ నుంచి సురక్షితంగా వీడండి
- భారత ప్రజలకు కేంద్రం అడ్వయిజరీ
- యుద్ధ విరమణతో మార్కెట్లకు జోష్
- భారీ లాభాల్లో ప్రారంభం అయిన దేశీయ సూచీలు



6

**వాషింగ్టన్,ఏప్రిల్ 8(నినాదం):** ఇరాన్, అమెరికాల మధ్య 15 రోజుల సీజ్ ఫైర్ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై ట్రంప్ తన సొంత సోషల్ మీడియా 'ది ట్రూత'లో వరుస పోస్టులు పెడుతున్నారు. తాజాగా, 'ప్రపంచ శాంతికి ఇది గొప్ప రోజు. ఇరాన్‌తో పాటు ఇతర దేశాలు కూడా శాంతి కోరుకుంటున్నాయి. హోర్ముజ్ జలసంధిలో ట్రాఫిక్ క్లియరెన్స్‌కు సహకరిస్తాం' అని రాసుకొచ్చారు. అమెరికా సీజ్ ఫైర్ నిర్ణయానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు తెలిపింది. లెబెనాన్ విషయంలో మాత్రం వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేసింది. అంతర్జాతీయ మార్కెట్లలో ఫుల్ జోష్ తీసుకొచ్చింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు ధరలు కూడా భారీగా దిగి వచ్చాయి. ఈ నేపథ్యంలో దేశీయ సూచీలు కూడా భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ బలపడింది.

6

### కాళేశ్వరం మోటర్లను
## దెబ్బతీసే కుట్రలు

- సరైన మెయింటెనెన్స్ లేకుండా చేస్తే ఎలా?
- మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ



**హైదరాబాద్, నినాదం:** కాళేశ్వరానికి సంబంధించి భారీ నీటిపారుదల మోటార్లను ధ్వంసం చేసే కుట్ర సాగుతోందంటూ కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజమెత్తారు. భారీ నీటిపారుదల మోటార్లను ఇష్టానుసారంగా ఆన్, ఆఫ్ చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

▸▸ 2లో..

### ర్యాష్ డ్రైవింగ్‌కు
## ముగ్గురు బలి

- ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు
- మరో యువకుడు మృతి




**హైదరాబాద్,ఏప్రిల్ 8(నినాదం):** ఓ తాగుబోతు డ్రైవర్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. మూడు కుటుంబాల్లో కడుపుకోత పెట్టాడు. ముగ్గురు యువకులు దర్మరణం చెందారు. భవిష్యత్‌పై ఎంతో కలలతో ఇంజనీరింగ్‌లో అడుగుపెట్టిన ఇద్దరు విద్యార్థులు అసువులు బాసారు. వివరాల్లోకి వెళితే.. సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు.

▸▸తరువాయి 2లో..



## చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి

- సిఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ
- సిఎంతో భేటీ అయిన టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్

### ఖర్చుగా కాదు..
## భాగస్వామ్యంగా చూడండి

- ప్రాధాన్య రంగాలను మీరే ఎంచుకోండి
- అవసరమైన సహకారం మేం అందిస్తాం
- సిఎస్ఆర్ నిధులపై పెనీల ప్రతినిధులతో రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఏప్రిల్ 8(నినాదం):** సమాజాభివృద్ధికి చేసేది ఖర్చుగా కాకుండా భాగస్వామ్యంగా చూడాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. సీఎసఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కంపెనీలు సీఎసఆర్‌కు చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలన్నారు. తమ ప్రభుత్వం విద్యా, వైద్యం, జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తుందని తెలియజేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎసఆర్ నిధులు వినియోగించాలని సూచించారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు కలిపి చేసే వ్యయంతో తెలంగాణ విద్యార్థులను ప్రపంచ స్థాయి నైపుణ్యం ఉన్న వారిగా తీర్చిదిద్ది భవిష్యత్ అవకాశాలను వారు అందిపుచ్చుకునేలా తయారు చేయగలమని సీఎం అన్నారు.

▸▸తరువాయి 2లో..

### పైలట్ శిక్షణకు వచ్చిన
## యువతిపై అత్యాచారం

- యువతిపై ట్రైనీ ఇన్‌స్ట్రక్టర్ పలుమార్లు అఘాయిత్యం
- ఫిర్యాదుతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



**హైదరాబాద్,ఏప్రిల్ 8(నినాదం):** బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఏవికన్స్ పైలెట్ శిక్షణ సంస్థలో శిక్షణ తీసుకుంటున్న యువతిపై ట్రైనీ ఇన్ స్పెక్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే సంస్థలో శిక్షణ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న కేరళకు చెందిన నసిముద్దీన్ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు . ఈ కేసులో నసీముద్దీన్ కు సహకరించిన దమ్మాయిగూడ కు చెందిన మరొక శిక్షణ ఇచ్చే ఇన్స్పెక్టర్ సల్మాన్. యువతి పై అత్యాచారం జరిపి వీడియోలు ఫోటోలు తీసుకుని పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డాడు నసీముద్దీన్.

2

### మంత్రులపై బురదజల్లడమే
## బిఆర్ఎస్ పని

- వారికున్న బురదను మాకు అంటించాలని యత్నం
- నాదర్ గుల్, వట్టినాగులపల్లి భూములపై నిందలు
- హరీష్‌కు వాటా దక్కక పోవడంతో ఇప్పుడు విమర్శలా
- మండిపడ్డ మంత్రి పొంగులేటి

2

**హైదరాబాద్,ఏప్రిల్ 8(నినాదం):** నాదర్‌గుల్ భూముల విషయంలో భారత రాష్ట్ర సమితి నేత హరీశ్ రావు దుష్ప్రచారం చేస్తున్నారని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సర్వే నంబర్ 613లోని భూములను 2014లో మూడు సంస్థలకు అప్పటి బీఆరఎస్ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసిందని తెలిపారు. భూముల మ్యుటేషన్ జరిగిన 2016లోనూ వారి ప్రభుత్వమే ఉందన్నారు. 2014, 2016లో జరిగిన రిజిస్ట్రేషన్లతో ఈ ప్రభుత్వానికి ఏం సంబంధమని ప్రశ్నించారు.



## ఢిల్లీకి గులంగిరీ చేస్తున్న రేవంత్ ప్రభుత్వం

- కొత్త పార్టీతో సామాన్యులకు అండగా నిలుస్తాం
- కాంగ్రెస్ అవినీతిపై ఇక నిరంతరంగా నిలదీస్తాం
- ఏప్రిల్ 25 చరిత్రను మార్చే రోజు అవుతుంది
- జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్,ఏప్రిల్(నినాదం):** దేశంలో ఎక్కడ ఎన్నికలు వచ్చినా సరే కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఢిల్లీకి ఘోరమైన గులాంగిరి చేస్తోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ చేస్తే ఫోన్‌లో మాట్లాడేటప్పుడు కూడా రేవంత్‌రెడ్డి నిలబడే మాట్లాడుతున్నారని.. లేదంటే తన కుర్చీకి ఎక్కడ ఎసరు వస్తుందోనని భయపడుతున్నారని సెటైర్లు గుప్పించారు. బుధవారం తెలంగాణ జాగృతిలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు చేరారు. కండువా కప్పి జాగృతిలోకి కవిత ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. రాసి పెట్టుకోండి.. తెలంగాణ భవిష్యత్, చరిత్రను మార్చే రోజు ఏప్రిల్ 25 అవుతోందని కవిత ఉద్ఘాటించారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయాలను ఈ గడ్డకు పరిచయం చేస్తానని పేర్కొన్నారు.



## కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు

- ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ
- రూ.41,533.81 కోట్లు కేటాయింపు
- జైపూర్ మెట్రో ఫేజ్`2కు ఆమోదం

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 8(నినాదం):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు. ఇది 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ.4,313 కోట్ల రూపాయలు అధికం. 2025 ఖరీఫ్ బడ్జెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది. కాగా, జైపూర్ మెట్రో ఫేజ్`2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడి`మోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపుతూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్`సౌత్ కారిడార్‌గా దీన్ని నిర్మించనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది. రాజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ రిఫైనర్ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది`కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి`2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ భవితవ్యంపై ఉత్కంఠ

నిర్వహణల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై ఇప్పటికే కోర్టు వాదనలు విన్నది. బుధవారం తీర్పు వెలువరించాల్సి ఉండగా.. తీర్పును వాయిదా వేసింది. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. దీన్ని సవాలు చేస్తూ భారాస అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారి స్మితా సభర్వాల్, ఐఏఎస్ మాజీ అధికారి ఎస్.కె.జోషిలు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చెల్లుబాటుపై హైకోర్టులో వాదనలు ముగిశాయి. అయితే, ఈ వ్యవహారంపై తీర్పును ధర్మాసనం ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది. కాళేశ్వరం అవకతవకలపై విచారణ కోసం 2024 మార్చి 14వ తేదీన ప్రభుత్వం జీవో నంబర్ 6ను జారీ చేస్తూ జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమించింది. ఈ జీవోను సవాల్ చేస్తూ రాష్ట్రంలోని పలువురు కీలక నేతలు, అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ చేపట్టిన విచారణ పక్రియలో నిబంధనల ఉల్లంఘనలు జరిగాయని పిటిషనర్లు పేర్కొన్నారు. తమపై అభియోగాలు మోపే ముందు, తమ వాదనలను కమిషన్ పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపించారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా విచారణ సాగుతోందని వారు కోర్టుకు విన్నవించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలను వెలికితీసేందుకే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. కమిషన్ తన నివేదికను అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగానే సిద్ధం చేసిందని కోర్టుకు తెలిపింది. విచారణలో భాగంగా పిటిషనర్లందరికీ నోటీసులు ఇచ్చి, నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్తున్నామని, కాబట్టి ఈ పిటిషన్లను కొట్టివేయాలని ప్రభుత్వం కోరింది.చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని బెంచ్ ఇరుపక్షాల వాదనలను సుదీర్ఘంగా విన్న తర్వాత, నేడు వెలువరించాల్సిన తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

## ర్యాష్ డ్రైవింగ్‌కు ముగ్గురు బలి

మద్యం మత్తులో కారు ర్యాష్ డ్రై వింగ్ చేస్తూ ఓ వ్యక్తి.. ద్విచక్ర వాహనాన్ని, నడిచి వెళ్తున్న మరో యువకుడిని ఢీకొట్టాడు. వీరిని వంద మీటర్ల వరకు ఈడ్చుకెళ్లి కారు పల్టీ కొట్టింది. ఘటనలో ద్విచక్రవాహంపై వెళ్తున్న మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతిచెందారు. రోడ్డుపై నడిచివెళ్తున్న మరో యువకుడు కూడా మృతితి చెందాడు. దీంతో కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. భారీగా పోలీసులు మోవరించడంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ప్రమాదం చేసిన వ్యక్తిని తమకు అప్పగించాలని విద్యార్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పైలట్ శిక్షణకు వచ్చిన యువతిపై అత్యాచారం

ట్రైనింగ్ కోసం వచ్చిన యువతిని మాయ మాటలతో లొంగ దీసుకున్న ట్రైనింగ్ నసిముద్దీన్. పలు మార్లు వేధింపులకు పాల్పడడంతో యువతి ట్రైనింగ్ ఆపేసింది. 2025 అత్యాచారం జరిగిన ప్రాంతం బేగంపేట పరిధిలో ఉండడం తో బేగంపేట పోలీస్ లకు ఫిర్యాదు చేసింది. జనవరి 2025 నుండి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డట్లు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన బేగంపేట పోలీసులు నసీముద్దీన్ ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

## చేనేతలో టెండర్ల విధానం రద్దు చేయండి

**హైదరాబాద్,ఏప్రిల్8(నినాదం):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనా హైకమిషనర్ క్యాసి ఒబిరి`డాన్సో మర్యాదపూర్వకంగా కలిసిన రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా హైదరాబాద్ కు వచ్చిన క్యాసి ఒబిరి`డాన్ సిఎంను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఘనా, తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించిన హైకమిషనర్. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం ఉండాలని కోరిన హైకమిషనర్. అనుకూలంగా స్పందించిన సీఎం రేవంత ఆయనకు శాలువాతో సన్మానించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారతదేశంలో ఎప్`130ఏ సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనున్న లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ. అంతర్జాతీయ అవసరాల కోసం భారతదేశంలోని టిఎఎస్‌ఎల్ లో ఈ`16 వింగ్స్ ను ఉత్పత్తి చేసేందుకు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు ఈ సందర్భంగా టిమ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## మంత్రులపై బురదజల్లడమే బిఆరఎస్ పని

హరీశ్ రావు చెబుతున్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభించారు. భూములు పొందిన వారు నాలా కన్వర్షన్ ఇవ్వట్లేదని 2022లోనే సుప్రీంకోర్టుకు వెళ్లారు. వాళ్లు కోర్టుకు వెళ్తే బీఆరఎస్ ప్రభుత్వం కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. అవి ప్రభుత్వ భూములు అని చెప్పి మేం కౌంటర్ వేశాం అని అన్నారు.. ఆనాడు వాటాల ఒప్పందం చేసుకుని భూములు కట్టబెట్టి ఇవాళ మా మీద నిందలు వేస్తున్నారు. నాదర్ గుల్ భూముల్లో వాటా రాక పోవడంతో హరీశ్ రావు ఇవాళ తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. ప్రొహిబిటెడ్ భూముల్లో ఈ ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో నా కుటుంబ సభ్యులెవరూ లేరు. నా కుటుంబ సభ్యులు ఉన్నారని నిరూపించాలని సవాల్ చేస్తున్నా. వట్టి నాగులపల్లి భూముల్లోనూ హరీశ్ రావు పూర్తిగా దుష్ప్రచారం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివాదాన్ని కూడా ఈ ప్రభుత్వానికి అంటగట్టారని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేయడమే బీఆరఎస్ నేతలు పనిగా పెట్టుకున్నారంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో అవకతవకలని ఉప ముఖ్యమంత్రిపై తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. సన్న బియ్యం పట్ల ప్రజల్లో వచ్చిన ఆదరణ జీర్ణించుకోలేక పౌర సరఫరాలో అవినీతి అంటూ మంత్రి ఉత్తమ్ పై మరో పుకారు పుట్టించారని అన్నారు. లిక్కర్ బాటిల్స్ కి వేసే స్టిక్కర్ల విషయంలో, టెండర్ల విషయంలో అవకతవకలు అంటూ లిక్కర్ విషయంలో ఎక్సయిజ్ శాఖ మంత్రి జూపల్లి మీద కూడా అదే రకంగా నిందలు వేశారని మండిపడ్డారు. దేశంలో కొన్ని రాష్ట్రాల్లో చేపట్టే హ్యామ్ సిస్టంలో రోడ్ల నిర్మాణం చేపడితే... బీఆరఎస్ ఉనికికి ప్రమాదం వస్తుందని.. మంత్రి కోమటిరెడ్డిపై తప్పుడు ప్రచారం చేశారని.. క్రషర్లు అంటూ తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని పొంగులేటి అన్నారు. ఇలా ప్రతి మంత్రి మీద తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. బీఆరఎస్ నేతల మీద ఉన్న బురదను ప్రభుత్వం మీద చల్లితే..వారు శుభ్రంగా ఉంటామని భ్రమలలో బతుకుతూ అసత్యాలని నిజాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు.

## ఢిల్లీకి గులంగిరీ చేస్తున్న రేవంత్ ప్రభుత్వం

ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తాం, పోరాడుతాం, పరిష్కరిస్తామని చెప్పుకొచ్చారు. పప్పన్నం తింటాం, ప్రజల మధ్యలో ఉంటామని.. వారితోనే కలిసి పనిచేస్తామని మాటిచ్చారు. సామాన్యులతో, సామాన్యుల కోసం, సామాన్యులే ఉండేలా రాజకీయం తెస్తామని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అధికార పక్షం కాంగ్రెస్, ప్రతిపక్షం బీఆరఎస్ ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోవటం లేదని ప్రశ్నించారు. ప్రజల సమస్యల గురించి ప్రశ్నించేదెవరు అంటే ప్రతినోట జాగృతియే అనే మాట వస్తోందని చెప్పారు. ప్రజల సమస్యల గురించి కాంగ్రెస్ హై కమాండ్‌ని పైసలు అడిగితే నో రాహుల్ జీ అని రేవంత్‌రెడ్డికి సమాధానం చెబుతున్నారని అన్నారు. కానీ కేరళ ఎన్నికల కోసం ఎంత ఖర్చయినా పెడుతున్నారని విమర్శించారు. అప్పర్ తుంగభద్రకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇస్తే రేవంత్‌రెడ్డి ఎందుకు సైలెంట్‌గా ఉన్నారని ప్రశ్నించారు. జాతీయ హోదా కారణంగా తుంగభద్రకు నీళ్ల రాక నష్టపోయేది ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాయేనని.. కానీ ఈ విషయంలో రేవంత్‌రెడ్డి ఎందుకు మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని నిలదీశారు. అటు కాంగ్రెస్‌ను, ఇటు బీజేపీని మెయింటెయిన్ చేస్తూ ప్రజలను మాత్రం మోసం చేస్తున్నారని ఆగ్రహించారు. తెలంగాణ జాగృతి తరపున వచ్చే పార్టీ.. ప్రజల సమస్యలపై పోరాటం చేస్తుందని భరోసా కల్పించారు. అంతర్జాతీయ స్థాయిలో నిపుణులతో సమావేశమై ప్రజల కోసం అద్భుతమైన అజెండా రూపొందిస్తున్నానని చెప్పుకొచ్చారు. కొత్త తరహా రాజకీయాలు, ప్రజల కోసం మంచి చేసే రాజకీయాలు ఎలా ఉంటాయో చూపిస్తామని కవిత పేర్కొన్నారు.

# ఖర్చుగా కాదు.. భాగస్వామ్యంగా చూడండి

విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారని.. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైన ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించు కుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం లేనందున తాము ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఇందుకు నియమించామని సీఎం తెలిపారు. కంపెనీల ప్రతినిధులు ఆయనతో సమన్వయం చేసుకొని తమకు ఆసక్తి ఉన్న విద్యా, వైద్యం, జల వనరులు, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ ఇలా దేనికైనా సీఎస్ఆర్ నిధులు వినియోగించవచ్చని సీఎం తెలిపారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయని.. వారికి సీఎం అభినందనలు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆసుపత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు.. సమావేశంలో రహేజా ఫౌండేషన్ నుంచి శ్రావణ్ కుమార్, రాంకీ ఫౌండేషన్ నుంచి దాక్షయణి ఆళ్ల, యశోద ఆసుపత్రి నుంచి డాక్టర్ గోరుకంటి సురేందర్ రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు, మేఘా నుంచి సుధా రెడ్డి, అపోలో ఆసుపత్రి నుంచి అపర్ణా రెడ్డి, కామినేని భాస్కర్ రెడ్డి, ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ నుంచి శేఖర్ రెడ్డి, పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.



# గిరిజన ప్రాంత సమస్యలపై మానవతా దృక్పథంతో పనిచేయండి

### మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు పెద్దపీట వేయాలి

### గిరిజన జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ప్రభుత్వం సంకల్పం

### ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా చిత్తశుద్ధితో పని చేయండి

### అధికారులకు దిశ నిర్దేశం చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్,ఏప్రిల్ 8(నినాదం):**

గిరిజన ప్రాంత సమస్యల పరిష్కారంలో అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయాలని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. గిరిజన జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని, ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం పేద గిరిజనులు నివసించే ప్రతీ ప్రాంతానికి చేరుకునే త్రోవ, నివసించేందుకు గూడు , అడవుల్లో చీకట్లు తొలగించే విద్యుత్ సౌకర్యం, తాగునీటి కోసం బోర్లు వంటి ప్రాథమిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ఈ మౌలిక సదుపాయాలే గిరిజనుల జీవన ప్రమాణాల పెరుగుదలకు పునాది అని పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో గిరిజన ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి వివిధ జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ పీవోలు, అటవీ శాఖ అధికారులు, గిరిజన ప్రాంతాల ప్రజాప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వం మౌలిక వసతుల కోసం నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ, అమలు దశలో ఎదురవుతున్న అడ్డంకులపై మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగు పర్చాలంటే శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిరిజనుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, కేటాయించిన నిధులు లక్ష్యానికి చేరేలా అధికారులు కట్టుదిట్టంగా పర్యవేక్షణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. నిధులు ఉన్నా పనులు జరగకపోవడం సహించబోమని హెచ్చరించారు.అటవీ భూములు, పోడు సాగు, ఫారెస్ట్ రైట్స్ చట్టం కింద హక్కుల పత్రాల జారీ విషయంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నారు. అటవీ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పని చేసి సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలని సూచించారు. అవసరమైతే ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి వేగంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అటవిని నమ్ముకొని జీవిస్తున్న గిరిజనలు వారికి కేవలం వ్యవసాయం ఒక్కటే ఆధారం కాబట్టి అటవీ చట్టం అనుసరించి వారికి ఎక్కడ వీలు అయితే అక్కడ వారికి వ్యవసాయం చేసుకునేలా సాగు భూమిని అందుబాటులో ఉండేలా చూడాలని మంత్రి అటవీశాఖ అధికారులను ఆదేశించారు. గిరిజన యువతను ప్రభావితం చేస్తున్న కుల ధ్రువీకరణ సమస్యలపై మంత్రి ప్రత్యేక చొరవ చూపారు. హైకోర్టు అడ్వకేట్ జనరల్‌తో సంప్రదించి ఎస్టీ సర్టిఫికెట్ వ్యవహారంలో శాశ్వత పరిష్కారం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ధ్రువీకరణలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా సరళమైన విధానాన్ని అమలు చేయాలని సూచించారు. జిల్లాస్థాయిలో కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులు, అటవీ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో ప్రత్యేక సమీక్షలు నిర్వహించి సమస్యలను స్థానికంగానే పరిష్కరించే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఇసుక రవాణా సమస్యలు గిరిజనులకు అడ్డంకి కాకూడదని మంత్రి స్పష్టం చేశారు. అవసరమైన చోట ప్రత్యేక అనుమతులు ఇచ్చి నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సూచించారు. అలాగే తాగునీటి సమస్య నివారణకు కొత్త బోర్లు త్రవ్వడం, పాత వనరులను పునరుద్ధరించడం చేపట్టాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని మంత్రి నిర్ణయించారు. గిరిజన గ్రామాలను స్వయంగా సందర్శించి వాస్తవ పరిస్థితులను తెలుసుకుంటానని తెలిపారు. నెలాఖరులోగా గిరిజన ప్రాంతాల్లో ముఖ్య సమస్యల పరిష్కారం దిశగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు ప్రారంభించాలని మంత్రి గడువు విధించారు. ఒక ప్రాంత సమస్యను రాష్ట్రవ్యాప్తంగా వర్తింపజేయకుండా, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ గిరిజన సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించినందుకు మంత్రిని ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్యసాచి ఘోష్, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సువర్ణ , ఎమ్మెల్యేలు బాలు నాయక్, రామచంద్ర నాయక్, డా. చిక్కుడు వంశీకృష్ణ, మురళి నాయక్, కోవ లక్ష్మి, అనిల్ కుమార్ యాదవ్ తో పాటు ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఐటీడీఏ అధికారులు, డిఎఫఓలు ఇతర ఉన్నత అధికారులు పాల్గొన్నారు.



## 2`బిహెచ్ కె కాలనీల్లో దుకాణాల విక్రయాలు

**అందుబాటులో 36 కాలనీల్లోని 1400 కు పైగా షాపులు**

**వచ్చే ఆదాయం ఆయా కాలనీల అభివృద్ధికే వినియోగం**

హైదరాబాద్ :హైదరాబాద్ పరిసరాల్లోని క్యూర్ పరిధిలోని డబుల్ బెడ్ రూం కాలనీల్లోని 1400 కు పైగా దుకాణాలను బహిరంగ వేల ద్వారా విక్రయించే పక్రియ ఏప్రిల్ 9 వ తేదీగురువారం నుంచి ప్రారంభం కానున్నది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్`మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 36 కాలనీల్లో ఉన్న దుకాణాలను వేలం ద్వారా విక్రయించడానికి ఆయా జిల్లా కలెక్టర్లు నోటిఫికేషన్లు కూడా ఇచ్చారు. ఈ పక్రియలో భాగంగా తొలుత రంగారెడ్డి జిల్లా పరిధిలోని 8 కాలనీల్లోని 273 షాపులకు ఈ నెల 9,10 తేదీల్లో వేలం పక్రియను నిర్వహించనున్నారు. వందలాది కుటుంబాలు నివసించే కాలనీల్లో, స్థానికుల అవసరాలకు అనుగుణంగా వ్యాపారకార్యక్రమాలు నిర్వహించుకునేలా 60`400 చదరపు అడుగుల విస్తీర్ణంలో పలు దుకాణాలను నిర్మించారు. వీటిని ఉన్నవి ఉన్నట్లుగా అన్న ప్రాతిపదికన విక్రయిస్తున్నట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు. వీటికి కనీస ధరలను కూడా బహిరంగ మార్కెట్ కంటే తక్కువగా నామమాత్రంగానే నిర్ధారించారు. ఆసక్తి ఉన్న వారు ఆయా కాలనీలను సందర్శించి, తమకు నచ్చిన, అనువైన దుకాణాలను ఎంపిక చేసుకోవచ్చన్నారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు నిర్ణీత మొత్తం ధరావతు (ఇంఎండి) తో వేలం నిర్వహించే తేదీల్లో ఉదయం గం.11.00 లోగా సంబంధిత ఆర్డీవో కార్యాలయంలో రిజిస్టర్ చేసుకోవచ్చని ఆయన వివరించారు. పేదల వర్గాల ప్రజల కోసం మంచి వసతులతో, ఆహ్లాదకరమైన పరిసరాలతో అన్ని సదుపాయాలను కల్పిస్తూ ప్రభుత్వం డబుల్ బెడ్ ఇండ్ల కాలనీలను నిర్మిస్తున్నది. ఈ కాలనీల నిర్వహణ నిమిత్తం, ఈ దుకాణాల వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని వినియోగించనున్నారు.

## యధాతథంగా కీలక వడ్డీరేట్లు

**ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా**

ముంబై :కీలక వడ్డీ రేట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుసగా రెండోసారి కూడా యధాతథంగా ఉంచింది. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తాజాగా వెల్లడించారు. ఈసారి కూడా రెపో రెటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నామని ప్రకటించారు. దేశ ఆర్థిక వృద్ధిపై ఆశావహ అంచనాలు వెల్లడించిన ఆర్బీఐ గవర్నర్, అంతర్జాతీయ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్బీఐ రెపో రేట్లను ఆర్బీఐ యధాతథంగా ఉంచడం వరుసగా ఇది రెండోసారి. గత ఫిబ్రవరిలో జరిగిన సమీక్షలో కూడా వడ్డీ రేట్లలో ఆర్బీఐ ఎలాంటి మార్పులూ చేయలేదు. కాగా, అంతర్జాతీయ పరిస్థితులపై ఆర్బీఐ గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పలు సవాళ్లు ఎదురవుతున్నాయని, వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. 2026`27 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.9 శాతంగా నమోదు కావొచ్చని అంచనా వేశారు ప్రపంచవ్యాప్తంగా చమురు ధరల్లో పెరుగుదల ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించవచ్చని ఆర్బీఐ గవర్నర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 4.6 శాతంగా ఉండొచ్చన్నారు. అలాగే ఏప్రిల్ 3వ తేదీ నాటికి భారత ఫారెక్స్ నిల్వలు 696.1 బిలియన్ డాలర్లు అని పేర్కొన్నారు. మరోవైపు దేశీయ వినియోగం బలంగా ఉందని, పెట్టుబడులు పెరుగుతున్నాయని తెలిపారు.

## రాష్ట్ర రెవెన్యూ రంగంలో విప్లవాత్మక మార్పు

**భూ యజమానులకు భరోసా**

**1.12 కోట్ల మందికి పట్టా దారులకు పాస్ పుస్తకాలు**

**ప్రతి ఇంటికి రిజిస్ట్రేషన్ చేయించుకునే సౌకర్యం**

అమరావతి : రాష్ట్రంలో భూ యజమానులకు, పేద కుటుంబాలకు భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. రెవెన్యూ శాఖపై జరిపిన సమీక్షలో సుమారు 75 లక్షల మందికి ప్రయోజనం చేకూరేలా పలు నిర్ణయాలు తీసుకున్నారు. భూములు విముక్తి నుంచి రిజిస్ట్రేషన్ల సరళీకరణ వరకు సీఎం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రెవెన్యూ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా భూములు రీసర్వే పక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. 2027 మార్చి నాటికి రీసర్వే 2.0 పూర్తి చేసి, 1.12 కోట్ల మంది పట్టా దారులకు కొత్త పాస్ పుస్తకాలను పంపిణీ చేయడమే లక్ష్యంగా పెట్టుకోవాలని అధికారులను ఆదేశించారు. దీని వల్ల భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను సెక్షన్ 22`ఎజాబితా నుంచి తొలగించాలని నిర్ణయించారు.

# అమెజాన్‌లో భారీగా ఉద్యోగుల తొలగింపు

**ప్రచారాన్ని ఖండించిన అమెజాన్ సంస్థ**

న్యూఢిల్లీ : ముచ్చటగా మూడో సారి భారీగా ఉద్యోగాల కోతకు ప్రముఖ ఇ కామర్స్ సంస్థ అమెజాన్ ప్రణాళికలు సిద్ధం చేస్తుందంటూ ఆన్ ఫోరమ్స్, టెక్ పోర్టల్స్ వేదికగా జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే రెండు దశల్లో భారీగా ఉద్యోగులను కొలువుల నుంచి ఈ సంస్థ తొలగించింది. తాజాగా ఈ ఏడాది మే మాసంలో మళ్లీ భారీగా ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగిస్తుందంటూ ప్రచారం జరుగుతుంది. దీంతో ఆ సంస్థ ఉద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఈ నేపథ్యంలో అమెజాన్ తాజాగా స్పందించింది. ఈ ప్రచారాన్ని అమెజాన్ ఖండించింది. ఈ ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదని ప్రకటించింది. చైనాకు చెందిన టెక్ పోర్టల్ లీ ఫెంగ్ నెట్‌వర్క్ సైతం ఈ వార్తను ప్రచురించింది. అమెజాన్ వెబ్ సర్వీసెస్, రిటైల్, మానవ వనరుల విభాగంలోని ఉద్యోగులపై ఈ ప్రభావం ఉండవచ్చని చైనా టెక్ పోర్టల్ వివరించింది. అలాగే ఎల5 నుంచి ఎల7 ఉద్యోగ స్థాయిల్లోని మేనేజర్లు, వైట్ కాలర్ ఉద్యోగులపై కూడా ఈ ప్రభావం ఉంటుందని అభిప్రాయం వ్యక్తమవుతుంది. కానీ గిడ్డంగి, లాజిస్టిక్స్ సిబ్బందిపై ఈ ప్రభావం ఉండదని నివేదికలు చెబుతున్నాయి. అయితే ఈ కార్పొరేట్ కంపెనీ ఇప్పటికే 2025 అక్టోబర్‌లో 14 వేల మంది, 2026 జనవరిలో 16 వేల మంది ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించింది. ఈ సంస్థ కార్యకలాపాలను క్రమబద్ధీకరించడం కోసం సీఈవో ఆండీ జస్సీ నేతృత్వంతో ఈ ఉద్యోగుల తొలగింపు పక్రియను చేపట్టింది. మరోవైపు ఐఏ, మౌలిక సదుపాయాలలో అమెజాన్ సంస్థ భారీగా పెట్టుబడులు పెడుతుంది. ఈ పెట్టుబడులను పెంచుకొంటూ పోతుంది. ఏఐ వినియోగం పెరిగే కొద్దీ.. ఉద్యోగుల పాత్ర మునుపటి స్థాయిలో ఉండక పోవచ్చుననే అభిప్రాయాన్ని అమెజాన్ సంస్థ తాజాగా వ్యక్తం చేస్తోంది. 2022 నుంచి ఇప్పటి వరకు 57 వేల మందికిపైగా ఉద్యోగులను అమెజాన్ తొలగించిన విషయం విదితమే.

# వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌పై దుండగుల రాళ్లదాడి

### గస్తీ పోలీసులు రావడంతో ముఠా పరార్

### ముఠాలో పోలీసులకు చిక్కిన ఇద్దరు మహిళలు

హైదరాబాద్ : ఒడిశా, బిహార్ రా ల తరహాలో తెలంగాణలోనూ రైలుపై దాడి జరగడం కలకలం రేపింది. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ లక్ష్యంగా దుండగులు రాళ్లతో దాడికి తెగబడ్డారు. గస్తీలో ఉన్న పోలీసులు అప్రమత్తమవ్వడంతో దుండుగులు పారిపోయారు. ఈ క్రమంలో వారిని పట్టుకునేందుకు సినీఫక్కీలో పోలీసులు చేజింగ్ చేశారు. కానీ 30 మంది గ్యాంగ్ తప్పించుకుని వెళ్లింది. అయితే గ్యాంగ్‌లోని ఇద్దరు మహిళలు మాత్రం పట్టుబడ్డారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతి బయల్దేరిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ గతరాత్రి తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ దాటుతున్న సమయంలో ట్రాక్ పక్కన 30 మంది గ్యాంగ్ మాటు వేసి ఒక్కసారిగా రాళ్ల వర్షం కురిపించింది. కిటికీలు, బోగీలకు రాళ్లు తగలడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. సరిగ్గా అదే సమయంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఆ గుంపును గమనించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. గ్యాంగ్‌ను పట్టుకునేందుకు పోలీసులు యత్నించగా.. సుమారు 30 మంది గుంపు పోలీసులనే రౌండప్ చేసి దాడికి యత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అదనపు బలగాల సాయం కోరారు. దీంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ క్రమంలో వారిని కిలో మీటర్ల మేర ఛేజ్ చేశారు. కానీ నందిగామ మండలంలోని పాత జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎన్‌సీఎల్ వెంచర్ గుండా పరుగులు తీసి చీకట్లో తప్పించుకున్నారు. కానీ ఇద్దరు మహిళలు మాత్రం పోలీసులకు చిక్కారు. వారిని బిహార్, ఒడిశా, రాజస్థాన్‌కు చెందిన ముఠాలుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అరెస్టయిన ఆ ఇద్దరు మహిళలను విచారించగా, తాము రుద్రాక్ష మాలలు అమ్ముకోవడానికి వచ్చామని చెబుతున్నారు. అయితే, అర్ధరాత్రి వేళ రైలుపై దాడికి గల కారణాలపై వారు సరైన వివరణ ఇవ్వడం లేదని, వారి వేషధారణ, ప్రవర్తనపై పోలీసులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వీరంతా పక్కా ప్రణాళికతోనే రైళ్లను లక్ష్యంగా చేసుకున్నారా? అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. పరారైన ఆ 30 మంది గుంపు కోసం పోలీసులు రాత్రంతా వెంచర్లలో గాలింపు చర్యలు చేపట్టారు. రాజస్థానీ వేషధారణలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నందిగామ, తిమ్మాపూర్ పరిసర గ్రామాల్లోని ప్రజలు అపరిచితులకు ఆశ్రయం ఇవ్వకూడదన్నారు రైల్వే ట్రాక్‌ల సమీపంలో అనుమానిత కదలికలు ఉంటే డయల్ 100 కి కాల్ చేయాలని కోరారు. ప్రస్తుతం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు ముమ్మరం చేశారని, ఈ ముఠా వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా లేదా వీరు దొంగతనాల కోసం ఇలా చేస్తున్నారా అనేది తేలాల్సి ఉంది.



# షెడ్యూల్ మిస్ అయితే చర్యలు తప్పవు: కలెక్టర్ హెచ్చరిక

## యంగ్ ఇండియా స్కూల్స్‌తో ఖమ్మం విద్యా రంగానికి కొత్త దిశ... వచ్చే విద్యా సంవత్సరానికి గురుకులాలు సిద్ధం చేయాలి: కలెక్టర్

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 08:**

పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. నిర్ణీత షెడ్యూల్‌కు అనుగుణంగా పనులు పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని అధికారులను గట్టిగా హెచ్చరించారు.బుధవారం పాలేరు నియోజకవర్గంలో పర్యటించిన కలెక్టర్, ఖమ్మం రూరల్ మండలం పోనేకల్‌లో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిర్మాణ ప్రాంతాలను పరిశీలిస్తూ పనుల నాణ్యత, భవనాల నమూనా మ్యాపులను సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు.గురుకులాల వద్ద లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతులు ఎటువంటి అంతరా యం లేకుండా కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించే విధంగా అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయా లని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు దారి తీస్తాయని, పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రపంచానికి పోటీ పడే విధంగా విద్యార్థులను తీర్చి దిద్దేందుకు అవసరమైన అన్ని మౌలిక వస తులు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఖమ్మం జిల్లాలో ఐదు యంగ్ ఇండియా సమీకృత గురుకు లాలకు అనుమతులు లభించగా, ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతు న్నాయని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు.వచ్చే విద్యా సంవత్సరం నాటికి పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికా రులను ఆదేశించారు.ఈ కార్యక్ర మంలో విద్యాశాఖ ఇఈ బుగ్గయ్య, ఖమ్మం రూరల్ మండల తహ సీల్దార్ యం. విన యేందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.







## ఈవీఎం గోడౌన్ ను పరిశీలించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 8 (నినాదం)**

జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఈవీఎం గోడౌన్ ను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల నెలవారి సాధారణ తనిఖీలో భాగంగా బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి సూచించారు. సందర్శనలో భాగంగా తనిఖీ రిజిస్టర్ లో కలెక్టర్ సంతకాలు చేశారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మంజుల, గద్వాల తహసీల్దార్ హరికృష్ణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## నంబర్ ప్లేట్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై స్పెషల్ డ్రైవ్

**ఖమ్మం, ఏప్రిల్ 8 (నినాదం)**

ద్విచక్ర వాహనాలకు నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. నగరంలో సరైన నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ ద్వారా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చైన్ స్నాచింగ్ వంటి నేరాలు పాల్పడి తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్ లేకుండా తిరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ముమ్మర తనిఖీ చెప్పటారు. సరైన నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ వద్ద వాహనదారులకు 14 వేల రూపాయలు, రాంగ్/ అపోజిట్ డ్రవింగ్ చేస్తున్న వాహనాలకు 17 వందల రూపాయలు వరకు జరిమానా విధించి, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించి, సరైన నెంబర్ ప్లేట్లు తెచ్చుకొని అమర్చిన వాహనాలకు వెసులుబాటు కల్పించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం నిర్లక్ష్యంగా రోడ్లపై వాహనాలు నిలపడం ద్వారానే జరుగుతున్నాయని, అదేవిదంగా మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని, రోడ్లపై తిరిగే వాహనాలకు తప్పనిసరిగా అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని, ప్రతీ వాహనదారుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. పెండింగ్ ఛానళ్లు చెల్లించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటున్న ట్రాఫిక్ నిబంధనలకు ప్రజలు సహకరించాలని కోరారు.





## సంక్షేమ వసతి గృహాలలో మెనూ అమలు చేయాలి

**నారాయణపేట ప్రతినిధి, ఏప్రిల్ 8, (నినాదం):**

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ, బాలుర, ఆనంద నిలయం( బాలికల) వసతి గృహాల ను తనిఖీ చేశారు. బాలుర వసతి గృహంలో మరుగు దొడ్లను, గదులను, డైనింగ్ హాల్, వసతి గృహ పై కప్పును పరిశీలించారు. వంటగదిలో సరుకుల నాణ్యతను చూశారు. అక్కడి మెనూ బోర్డును చూసి, మెనూ ప్రకారం టిఫిన్, స్నాక్స్, రాత్రి భోజనం ఇస్తున్నారా అని హాస్టల్ వార్డెన్ ను ప్రశ్నించారు. ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన మెనూ ను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలో ఉన్న ఆనంద నిలయాని (బాలికల వసతి గృహం) కి వెళ్ళి పరిసరాలను చూశారు. వంటగదిలోకి వెళ్ళి వంట మనుషులతో మాట్లాడి మెనూ గురించి ఆరా తీశారు. రోజూ ఖచ్చితంగా మెనూ ప్రకారమే పిల్లలకు ఆహారం ఇవ్వాలని స్పష్టం చేశారు. అదనపు మరుగు దొడ్ల కోసం ప్రతిపాదనలు చేసి పంపాలని వార్డెన్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, వార్డెన్ నిర్మలా పాల్గొన్నారు.

## ఇంటర్ అడ్మిషన్ షెడ్యూల్ రాలేదు

### జిల్లా ఇంటర్ విద్య అధికారి రవికుమార్

**నిజామాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 8 (నినాదం):**



జిల్లాలో కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, అధ్యాపకులు 10వ తరగతి ఫలితాలు రాక ముందే ఇంటర్ అడ్మిషన్లను చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇంకా ఇంటర్ బోర్డు అడ్మిషన్ షెడ్యూల్ విడుదల చేయలేదని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు.ఇంటర్ బోర్డు ద్వారా కళాశాలల గుర్తింపు ప్రక్రియనే ఇంకా పూర్తి కాలేదని, అనుమతి లేని కళాశాలలలో విద్యార్థులను చేర్చుకోవడానికి వచ్చే వారిని నమ్మవద్దని ఆయన తెలియజేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన కళాశాలలలో మాత్రమే ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులను చేర్పించాలని తెలియజేశారు. ఇంటర్ బోర్డు షెడ్యూలు విడుదల చేసేంత వరకు ఎవరు ఏ కళాశాలలో చేరడానికి అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. కావున విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు గమనించి అడ్మిషన్ ల కోసం వచ్చే వారిని నమ్మి మోసపోకూడదని ఆయన విజ్ఞప్తి చేశారు. ముందు అన్ని కళాశాలలు ఇంటర్ బోర్డ్ అనుమతి పొందాల్సి ఉంటుందని తెలిపారు. ఇంటర్ బోర్డ్ అడ్మిషన్ షెడ్యూలు విడుదల చేస్తుందని ఆ తర్వాత అడ్మిషన్ ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు. కావున విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు ప్రైవేటు కళాశాలల ప్రలోభాలకు లోనై ఎలాంటి ఫీజులు చెల్లించ రాదని, ఎలాంటి ప్రలోభాలకు గురి కావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇంటర్ బోర్డు అనుమతి పొందిన కళాశాలలలో మాత్రమే ఇంటర్ బోర్డ్ అడ్మిషన్ షెడ్యూలు వచ్చిన తర్వాత చేర్పించాలని ఆయన తెలిపారు.

## దానవాయిగూడెంలో ఇందిరమ్మ చీరల పంపిణీ

### రేషన్ కార్డు ఉన్న లబ్ధిదారులకు అందజేసిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 8 (నినాదం)**

రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన ఇందిరమ్మ చీరలను ఖమ్మం పార్ల మెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి బుధవారం దానవాయిగూడెంలో రేషన్ కార్డులు ఉన్న లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా .రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి తో కలిసి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూస్తోందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నాయకు డు కొండల్ జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాం క్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాధ బాబు, కార్పొరేటర్ లలితారాణి, చల్లా కృష్ణ, జంగం భాస్కర్, కృష్ణ గౌడ్, భట్టపోతుల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



**తల్లంపాడు వద్ద అమ్మ హోటల్ కు శ్రీకారం.....**

తల్లంపాడు వద్ద ప్రధాన రహదారి వెంట నూతనంగా అమ్మ హోటల్ ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం చేపట్టగా ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి హాజరై.. యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. నమ్మకం, నాణ్యతలో ఇప్పటికే పేరొందిన అమ్మ హోటల్.. ఇక్కడ కూడా అంతే విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

## పలు కుటుంబాలకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పరామర్శ

**ఖమ్మం, ఏప్రిల్ 08(నినాదం ):**

ఖమ్మం నగరంలో పలు కుటుంబ సభ్యులను మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పరామర్శించారు. బుధవారం బిఆర్ఎస్ నాయకులు ఖయుమ్ తల్లి రాబియా బేగం నిన్న అనారోగ్యంతో పరమపదించారు. వారి మృతికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ కార్పొరేటర్ పాలడుగు పాపారావు తండ్రి సత్యం ఇటీవల అనారోగ్యంతో పరమపదించారు. వారి మృతికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.మిర్చి శాఖా సెక్రటరీ ఎడ్లపల్లి సతీష్ సతీమణి స్వాతి నిన్న అనారోగ్యంతో పరమపదించారు. వారి మృతికి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు,మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్,టేకులపల్లి మాజీ సొసైటీ అధ్యక్షుడు బీరెడ్డి నాగచంద్రారెడ్డి,కార్పొరేటర్ మక్బుల్,నాగండ్ల కోటేశ్వర రావు,బిక్కసాని జస్వంత్,మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి,నాయకులు మెంతుల శ్రీశైలం,మందడపు రామకృష్ణ, ఎర్రా అప్పారావు,దడాల రఘు,యూత్ అధ్యక్షుడు దేవభక్తుని కిషోర్,మాటేటి కిరణ్ ప్రచార కార్యదర్శి షకీనా,ఉస్మాన్, మస్తాన్,లెలిన్ చౌదరి,పోటు శరత్,వెంకటేశ్వర్లు,తిరుపతయ్య, రమేష్,రాజు, మల్లేశం, నారుమళ్ళ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి గర్భవతి సురక్షిత మాతృత్వం పొందాలి

### సురక్షిత మాతృత్వం కొరకు వైద్యుల సూచనలు సలహాలు తప్పకుండా పాటించాలి....

### జిల్లా అదనపు (రెవిన్యూ) కలెక్టర్ పి. అమరేందర్

**నాగర్ కర్నూల్ ఏప్రిల్ 8 (నినాదం)**

ప్రతి గర్భవతి సురక్షిత మాతృత్వం పొందేలా వైద్య ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్ పి. అమరేందర్ అన్నారు. బుధవారం నాడు 99 రోజుల ఆరోగ్య మిషన్ కార్యక్రమం లో నిర్వహిస్తున్న ఆరోగ్య అవగాహన వారోత్సవంలో భాగంగా నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో గర్భవతులకు బాలింతలకు సురక్షిత మాతృత్వం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని గౌరవ జిల్లా అదనపు కలెక్టర్ పి. అమరేందర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం, సమాజం బాగుంటుందని,మహిళా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలియజేశారు. ముఖ్యంగా ప్రతి మహిళ విద్యావంతురాలు అయితే వైద్యులు ఆరోగ్య సిబ్బంది చెప్పిన విషయాలు పట్ల సంపూర్ణ అవగాహన కలుగుతుందని తద్వారా మహిళ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలుగుతుందని, మహిళలు గర్భం దాల్చడానికి ముందుగా మానసికంగా సంసిద్ధం కావాలని,రక్తహీనత నివారించడానికి స్థానికంగా లభించే పచ్చని ఆకుకూరలు, కాయగూరలు,పండ్లు, తృణధాన్యాలు తదితర పౌష్టికాహారం తీసుకోవాలని,వైద్యుల సూచనలు పాటించాలని, బిడ్డకు బిడ్డకు మధ్య కనీసం 3 సంవత్సరాల వ్యవధి,కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలని తెలియజేశారు.డి ఎం.హెచ్.ఓ డాక్టర్ కే.రవికుమార్ నాయక్ మాట్లాడుతూ గర్భం దాల్చిన మహిళా 12 వారాల లోపు గ్రామం లోని ఎ.ఎన్.ఎం.దగ్గర నమోదు చేసుకోవాలని, ఐరన్ ఫోలిక్,క్యాల్షియం, బి.సి. మాత్రలు తప్పకుండా గర్భవతులు వేసుకోవాలన్నారు.ప్రతి గర్భవతి కచ్చితంగా గైనకాలజిస్ట్ డాక్టర్ చెకప్ లు చేయించుకుని వారి సూచనలు పాటించాలని, వారి సలహా మేరకు బర్త్ ప్లాన్ చేసుకోవాలని, సాధారణ ప్రసవం అయ్యేలా వ్యాయామాలు, పౌష్టికాహారం తెలుసుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టి. ఉషారాణి మాట్లాడుతూ గర్భం దాల్చిన ప్రతి మహిళ కాన్పు తర్వాత తల్లి బిడ్డ క్షేమంగా (సురక్షిత మాతృత్వం) ఉండేలా ముందస్తుగా పరీక్షలు చేయించు కోవాలని,జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సుశిక్షితులైన నర్సింగ్ సిబ్బంది,వైద్య నిపుణులు ఉన్నారని , వారి సూచనలు ప్రతి గర్భవతి పాటించాలని తద్వారా 90% సాధారణ ప్రసవాలు జరుగుతాయని తెలియజేశారు. తదనంతరం స్త్రీ వైద్య నిపుణులు ప్రొఫెసర్లు డాక్టర్ నీలిమ,డాక్టర్ సుప్రియ గర్భవతులకు, బాలింతలకు తగిన సూచనలు సలహాలు తెలియజేశారు. ఆస్పత్రిలో ప్రతిరోజు 10 నుండి 15 ప్రసవాలు జరుగుతాయని నెలలో 430కు పైగా డెలివరీలు జరుగుతున్నట్లు తెలిపారు.తర్వాత జిల్లా అదనపు కలెక్టర్ గారి చేతుల మీదుగా సురక్షిత మాతృత్వ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.ఓ డాక్టర్ రవిశంకర్,డాక్టర్ ప్రశాంత్,ఆర్ఎంఓ ప్రోగ్రాం అధికారి డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ కవిత డాక్టర్ సాత్విక,జిల్లా మాస్ మీడియా అధికారి రాజగోపాలాచారి,నర్సింగ్ సూపరింటెంట్లు శైలజ,హెల్త్ ఎడ్యుకేటర్ నరసింహ,ఓరుగంటి శ్రీనివాసులు,నర్సింగ్ అధికారులు ఆనంద్, రూప,సువేదా, ప్రసన్న, హెల్ప్ డెస్క్ ఇంచార్జ్ యాదగిరి,వివిధ గ్రామాల గర్భవతులు,బాలింతలు పాల్గొన్నారు.





## కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాద బాధిత రైతులకు త్వరితగతిన న్యాయం చేయాలి

**మధిర, ఏప్రిల్ 8 (నినాదం):**

సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాద బాధిత రైతులకు సత్వరమే నష్టపరిహారం అందించాలని, బుధవారం స్థానిక తహసిల్దార్ రాంబాబును కలిసి ప్రమాద భీమా వివరాలను అడిగి తెలుసుకుని సత్వరమే న్యాయం చేయాలని తహసిల్దార్ని కోరడం జరిగింది. సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో అగ్నిప్రమాదం ద్వారా దగ్గం కావడం అందరికీ తెలిసిన విషయమే. ప్రమాద బీమా వర్తించడం కోసం రైతులు తమ వద్ద ఉన్న బాండు, ఆధార్ కార్డు మరియు బ్యాంకు పాస్ పుస్తకాల జిరాక్స్ లను మధిర తహసిల్దార్ కార్యాలయంలో త్వరగా అందించాలని, అట్లా అందించిన రైతులను గుర్తించి ప్రమాద భీమా కంపెనీకి పంపించడం జరుగుతుందని, కావున రైతులందరూ తొందరగా తహసిల్దార్ కార్యాలయానికి అందించగలరని కమిటీకి తెలియజేయడం జరిగింది. కావున రైతులందరూ ఈ విషయాన్ని గమనించి కమిటీకి మరియు అధికారులకు సహకరించగలరని కోరుతున్నాం. మధిర తహసిల్దార్ రాంబాబు ను కలసిన వారిలో బాలాజీ కోల్డ్ స్టోరేజ్ పోరాట కమిటీ కన్వీనర్ దివ్య, కో కన్వీనర్ గువ్వల సీతారాం రెడ్డి, పడకంటి మురళి తదితరులు పాల్గొన్నారు.



## మూల్యాంకన కేంద్రం సందర్శించిన కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్

**నిజామాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 8 (నినాదం)**

నిజామాబాద్ ఇంటర్ మూల్యాంకన కేంద్రంను ఇంటర్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జయప్రద బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మూల్యాంకన కేంద్రం పనితీరు పై ఆమె సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తోపాటు మూల్యాంకన కేంద్ర అధికారులు, ఇతర సిబ్బంది ఆమె వెంట ఉన్నారు.



## మధిరలో విద్యుత్ కార్మికుల సమ్మె

**మధిర, ఏప్రిల్ 8 (నినాదం):**

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్స్, అన్మాండ్, పీస్ రేట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్స్, జేఏసీ పిలుపుమేరకు మధుర విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయ సమీపంలో దీక్ష శిబిరం ఏర్పాటు చేసుకుని మధిర డివిజన్ పరిధిలోని కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు. కార్మికుల సమస్యలు యాజమాన్యం పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నట్లు కార్మికులు తెలియజేశారు. ఈ సమ్మెకు విద్యుత్ శాఖలోని ప్రధాన ట్రేడ్ యూనియన్ 327 యూనియన్, 114 యూనియన్, మరియు టి ఆర్ వి కె ఎస్ యూనియన్ మధిరడివిజన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొని పూర్తిస్థాయిలో సంఘీభావం తెలియజేశారు.

## ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి

### ఆత్మ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు

**ఖమ్మం, ఏప్రిల్ 8 (నినాదం):**





ఆయిల్ ఫామ్ సాగు విస్తరణ పై రైతాంగం దృష్టి సారించి ఆర్థికంగా నిలదొక్కోవాలని ఖమ్మం డివిజన్ ఆత్మ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం రఘునాధపాలెం మండలం బూడిదంపాడు రైతు వేదిక నందు ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు అధ్యక్షతన బూడిదంపాడు, మంచుకొండ గ్రామ రైతులకు ఆయిల్ పామ్ పంటలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నటువంటి దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ వలన రఘునాధపాలెం మండలంలో మంచుకొండ మరియు చింతగుర్తి గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయుట జరిగిందని దీనికి మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు, అదేవిధంగా మంచుకొండ ఎత్తిపోతల పథకం వలన మరియు బుగ్గ వాగు ఎత్తిపోత పథకం వలన రఘునాధపాలెం మండలం చెరువులు మరియు ఆయకట్టు ప్రాంతం పెరుగుతుంది కావున రైతులందరూ కూడా ఆయిల్ ఫామ్ సాగు పంట సాగు చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని రైతులకు సూచించడం జరిగింది. అదే విధంగా గతంలో ఎన్నడు లేనివిధంగా రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకాలను సబ్సిడీపై అందించడం జరిగిందని తెలియజేయడం జరిగింది. మంచుకొండ, బూడిదంపాడు రైతులు వెదజల్లే పద్ధతి ద్వారా వరిలో అధిక దిగులు సాధిస్తున్నారని దీనికి రైతులని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిథిగా పాల్గొన్నటువంటి ఖమ్మం సహాయ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంట ధర ప్రస్తుతం 23 వేల రూపాయలు ఉందని ఖచ్చితమైన సాగునీటి వసతి ఉన్నటువంటి రైతులందరూ తప్పనిసరిగా ఆయిల్ ఫామ్ పంట సాగు చేయాలని దీని కొరకు ప్రభుత్వం సబ్సిడీ రూపంలో ఆర్థిక సాయం చేస్తుందని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైరా కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ పావని మరియు చైతన్య గార్లు పాల్గొని రైతులకు వివిధ పంటలలో సాగు యాజమాన్య పద్ధతులను తెలియజేయడం జరిగింది. మరియు రఘునాధపాలెం మండల ఉద్యానవనాధికారి నగేష్ గారు రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా అందించేటటువంటి సబ్సిడీలు వివరించి రైతులకు ఉచితంగా కూరగాయల కిట్ అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కర్నాటి ఉమామహేశ్వర్ రెడ్డి, మంచుకొండ సొసైటీ మాజీ చైర్మన్ మందడపు సుధాకర్, ఖమ్మం ఏఎంసీ డైరెక్టర్ అంగడాల నరసింహారావు, గోద్రెజ్ ఆయిల్ ఫామ్ కంపెనీ ప్రతినిధులు రామకృష్ణ మరియు వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీకాంత్, శివ మరియు గ్రామ పెద్దలు వల్లభనేని వెంకట అప్పారావు తుమ్మలపల్లి మోహన్ రావు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

## ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా మాన్యం చెల్క ఆరోగ్య కేంద్రానికి 50 లక్షలు ఆర్థిక సహాయం

**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 8 (నినాదం)**

ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం బుధవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని మాన్యం చెల్కలో కోటి 91 లక్ష రూపాయల వ్యయంతో నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో రోగుల సంఖ్య విపరీతంగా పెరిగి పోవడాన్ని దృష్టిలో ఉంచుకొని మాన్యం చెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ నిధులతో పాటు, ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా 50 లక్షల రూపాయల వ్యయంతో అవసరమైన మౌలిక సదుపాయాలు, డాక్టర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాన్యం చెల్క యు పిహెచ్ సి కి నూతన భవనాన్ని నిర్మించడమే కాకుండా, అవసరమైన మెడికల్ సామాగ్రిని ఏర్పాటు చేయడం జరిగిందని . ఇంకా అవసరమైతే ఎక్కువ ఎక్విప్మెంట్ సమకూరుస్తామన్నారు. చుట్టుపక్కల ప్రజలు ,పెద్దవారు గర్భిణీ స్త్రీలకు, మాన్యం చెల్క పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అనువుగా ఉంటుందని ఇక్కడే అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేస్తామని, పరీక్షలతో పాటు, అవసరమైతే ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి రిఫర్ చేసే విధంగా వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు



సూచించారు. కార్పొరేటర్లు వివిధ రకాల జబ్బులతో బాధపడే ప్రజలను గుర్తించి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని చెప్పారు. నల్గొండ కార్పొరేషన్ అయినందున సిసి రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, మంచి వైద్య సదుపాయాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతీక్ ఫౌండేషన్ , ఎల్వీ ప్రసాద్ సంయుక్త ఆధ్వర్యంలో మూడెకరాల స్థలంలో కంటి ఆసుపత్రిని నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.అనుకోకుండా పట్టణ పి హెచ్ సి లో మందులు అందుబాటులో లేకుంటే ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఒక ప్రయివేట్ మెడికల్ షాపును గుర్తించి అవసరమైన అత్యవసర మందులు అందజేసే విధంగా అనుసంధానం చేయడం జరిగిందని, డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మందులు ఇవ్వడం జరుగుతుందని, ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. అవసరమైతే మాన్యం చెల్కపట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అక్షయ ఫౌండేషన్ సహకారంతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఆహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టర్లు, ఆశ వర్కర్లు బాగా పనిచేయాలని, పేద ప్రజలకు మంచి వైద్యం అందించాలని మంత్రి ఆదేశించారు. మాన్యం చెల్క చౌరస్తా సుందరీకరణతో పాటు, విస్తరించి తీర్చిదిద్దడం జరుగుతున్నదని తెలిపారు. నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మాన్యం చెల్క తో పాటు, చుట్టుపక్కల వార్డుల ప్రజలకు పట్టణ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సొంతంగా 50 లక్షల రూపాయలను పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఇవ్వడం పట్ల ఆమె మంత్రిని అభినందించారు. ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ విద్యతో పాటు, పేద ప్రజలకు వైద్యం అందించేందుకు మంత్రి చర్యలు తీసుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ ,ప్రధాన ఆస్పత్రి సూపరింటిండెంట్ నరసింహారావు నేత, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా టీబి నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, యు పి హెచ్ సి డాక్టర్లు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.



# అధైర్య పడకండి.. అండగా ఉంటా

## మంత్రి సీతక్క సహకారంతో పేదలకు మేలు
## సీనియర్ కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి

**ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 8 ( నినాదం)**

ఆపన్న సమయంలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుతామని అధైర్య పడకండి అండగా ఉంటా అని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబ శివరెడ్డి అన్నారు సోమవారం మండలంలోని అకినేపల్లి మల్లారం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఇప్ప నరసింహా రావు కుటుంబాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన పరామర్శించి ఆర్థిక సాయం అందించారు ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ గౌరవ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి సీతక్క గారు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్ గారి ఆదేశాల మేరకు మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు మంత్రి సీతక్క సహకారంతో పేదల కుటుంబాలకు మేలు జరుగుతుందని అన్నారు మృతుని సతీమణి ఇప్ప ప్రమీల కు ప్రజా పాలనలో వితంతు పింఛన్ వెంటనే మంజూరు చేస్తామని అదే విధంగా వికాస్ సంస్థలో పొందిన రుణం పై ఉన్న వడ్డీని పూర్తిగా మాఫీ చేస్తామని అంతేకాకుండా వివేక ఎఫ్పిఓ నుండి వ్యవసాయ సాగు కి అవసరమైన విత్తనాలు ఉచితంగా పంపిణీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు అనంతరం మృతుడు ఇప్ప నరసింహారావు సతీమణి ఇప్ప ప్రమీలకు తక్షణ సహాయం కింద రూ ఐదు వేల ఆర్థిక సహాయాన్ని నాసిరెడ్డి సాంబశివరెడ్డి అందించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు షేక్ మోయినుద్దీన్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ధూళిపాల బాలకృష్ణ కటుకూరి శేషయ్య నాసిరెడ్డి నాగిరెడ్డి లక్కీ వెంకన్న యలగొండ లక్ష్మయ్య చెట్టిపల్లి రాజు రవి సాంబశివరావు నరసింహారావు చౌదరి మాల మహానాడు నాయకులు రాజమళ్ళ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మాజీ మంత్రి పువ్వాడను కలిసిన బిఆర్ఎస్ నేతలు

**కొత్తగూడెం, ఏప్రిల్ 8 (నినాదం)**

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ని బుధవారం ఖమ్మంలోని వారి నివాసంలో లక్ష్మీదేవిపల్లి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వరరావు, కొత్తగూడెం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, గట్టుమల్ల సర్పంచ్ బట్టు కనకరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, స్థానిక సమస్యలు తదితర అంశాలపై చర్చించినట్లు సమాచారం. నాయకులు పువ్వాడ అజయ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధికి తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అలాగే, నియోజకవర్గ అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసి పనిచేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.



# కొండంపేట్ గ్రామంలో గుడుంబాపై ఎస్సై నరేశ్ దాడి.. 30 లీటర్ల స్వాధీనం

**మల్హార్, ఏప్రిల్ 8 (నినాదం):**

మండలంలోని కొండంపేట్ గ్రామంలో అక్రమ గుడుంబా తయారీపై కొయ్యూరు ఎస్సై నరేశ్, ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సుమారు 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.అలాగే గుడుంబా తయారీలో ఉపయోగిస్తున్న సుమారు 650 లీటర్ల బెల్లం వాష్‌ను ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.గ్రామాల్లో అక్రమ మద్యం తయారీని అరికట్టేందుకు ఇలాంటి దాడులు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు.

# సఖి సెంటర్ సేవలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజిగిరి, ఏప్రిల్ 8 (నినాదం)**

ప్రతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సఖి సెంటర్ సేవలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అంగన్వాడి, బాల వాటిక కేంద్రాలలో పిల్లల సంరక్షణ ఏర్పాట్లను సమీక్షించి, తగిన చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులకు సూచించారు. బోయన్పల్లి లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన సఖి కేంద్రం (వన్ స్టాప్ సెంటర్) అవగాహన సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ మహిళలు గర్భధారణ దశ నుండి జీవితాంతం ఎదుర్కొనే సమస్యలకు సమగ్ర పరిష్కారం అందించే సఖి కేంద్రం సేవలపై అవగాహన కల్పించడం, కుటుంబాలలో ఉత్పన్నమయ్యే భార్యాభర్తల గొడవలు, వరకట్న వేధింపులు, అత్త-కోడలు వివాదాలు వంటి సమస్యలను కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించేందుకు అల్వాల్‌లోని సఖి సెంటర్ 24 గంటలు అందుబాటులో ఉంటుందని, మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో వన్ స్టాప్ సెంటర్ హెల్ప్‌లైన్ -181, చిన్నపిల్లల సమస్యల కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ -1098 నంబర్లకు సంప్రదిస్తే తక్షణ సహాయం అందుతుందని వెల్లడించారు.

**సఖి సెంటర్ ద్వారా అందించే ముఖ్య సేవలు**

అత్యవసర స్పందన సేవలు, వైద్య సహాయం, రిఫరల్స్ పోలీస్ సహకారంతో కేసుల నమోదు (ఎఫ్ఐఆర్ లు), న్యాయ సలహాలు (లాయర్ల ద్వారా), సైకాలజికల్ కౌన్సిలింగ్, తాత్కాలిక వసతి సదుపాయం, బాల కార్మిక నిర్మూలనకు



చర్యలు, బాల్య వివాహాల నివారణకు అవగాహన కార్యక్రమాలు, గృహహింస, వరకట్న వేధింపులపై చట్టపరమైన అవగాహన, అనాధ పిల్లల కోసం (7–18 సంవత్సరాలు) ఆన్లైన్ నమోదు ద్వారా నెలకు రూ. 4000 ఆర్థిక సహాయం, ట్రాన్స్‌జెండర్లకు జీవనోపాధి కోసం ఎకనామిక్ రిహబిలిటేషన్ స్కీమ్ రూ. 75,000 వరకు ఆర్థిక సహాయం, చిన్నపిల్లల దత్తత ప్రక్రియ 2015 నుండి పూర్తిగా ఆన్లైన్ విధానంలో జరుగుతోందని అధికారులు వివరించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి శారద, అల్వాల్ సఖి సెంటర్ భవనంపై అదనపు అంతస్తు నిర్మాణం, విజిటర్స్ రూమ్, వీడియో కాన్ఫరెన్స్ హాల్, టాయిలెట్స్, స్నాన గదులు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాఖ సిబ్బంది తిరుమల, సలోమి, సునీత, నాగరాజు, మాజీ కార్పొరేటర్ లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, మేకల సునీత రాము యాదవ్, మహిళా నాయకురాళ్లు శోభ, ఉషశ్రీ, శ్రీదేవి, వైశాలి, రంగమ్మ, అనిత, సులోచన, శారద, అమృత, పర్వీన్, లలిత, లక్ష్మీ, ఆనంద్, అనురాధ, కవిత తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 8 ( నినాదం)**

యాసంగి 2025-26లో రైతులు పండించిన మొక్కజొన్న పంటలను కొనుగోలు చేసేందుకు రెండు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల జిల్లాలోని ఐజ, శాంతినగర్ సొసైటీలలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే గద్వాల మార్కెట్ యార్డ్ పరిధిలో కూడా మొక్కజొన్న కేంద్రాలు తెరవడం జరుగుతుందని, రైతులు మొక్కజొన్నలను దళారులకు అమ్మి నష్టపోకూడదని, ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాలలో అమ్ముకొని గిట్టుబాటు ధర పొందాలన్నారు.

# పిఎన్‌జీతో వంట గ్యాస్ సరఫరాకు కసరత్తు

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 8 ( నినాదం )**



భవిష్యత్తులో ఎల్పిజి గ్యాస్ కొరతను అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో పిఎన్ జీ( పైపుడ్ నాచురల్ గ్యాస్) తో కమర్షియల్ అవసరాలకు వంట గ్యాస్ సరఫరాకు కసరత్తు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బుధవారం సిజిడి (సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్) జిల్లా కమిటీ సభ్యులతో పిఎన్జి గురించి జిల్లా కలెక్టర్ జూమ్ మీటింగ్ లో మాట్లాడారు. పైప్ లైన్ ద్వారా కమర్షియల్ అవసరాలకు గ్యాస్ పంపిణీ చేసేందుకు జిల్లాలో ఉన్న సవాళ్లను దృష్టిలో ఉంచుకొని, ప్రణాళికతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. పైపుడ్ నాచురల్ గ్యాస్ సరఫరాకు మెగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారం అందించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, రోజుకు మూడు వేలకు పైగా సిలిండర్లు జిల్లాకు వస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు సుమారు 2400 బుకింగ్స్ జరుగుతున్నాయని, వినియోగదారులు గ్యాస్ బుక్ చేసిన మూడు రోజుల్లోనే డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్, మెగా కంపెనీ ప్రతినిధి వికాస్, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఇన్ క్లూజివ్ లైవ్లీ హుడ్ ప్రోగ్రాంకు జిల్లా ఎంపిక

## తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సమాఖ్య (సెర్ప్) ఆధ్వర్యంలో కార్యాచరణకు స్వీకారం
## గట్టు మండలంలో 15 గ్రామాల ప్రజలకు మేలు.
## నిరుపేదలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ సహకారం
## వివరాలు వెల్లడించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల బ్యూరో ఏప్రిల్ 8 ( నినాదం)**

కేంద్ర ప్రభుత్వ నీతి అయోగ్ ఆధ్వర్యంలో ఆస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రామ్ నిర్వహించబడుతున్న గట్టు మండలంలో పేద ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపరచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో తెలంగాణ ఇన్ క్లూజివ్ లైవ్లీ హుడ్ ప్రోగ్రాంకు జోగులాంబ గద్వాల జిల్లా ఎంపికైనట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ లైవ్లీహుడ్ ఇంక్లూసివ్ ప్రోగ్రాము అనేది తెలంగాణ ప్రభుత్వం ద్వారా తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సమాఖ్య అధ్వర్యంలో అమలు చేస్తున్న ఒక ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమం అని, దీని ప్రధాన లక్ష్యం పేద మరియు బలహీన వర్గాల కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించడం అని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలొ భాగంగా గట్టు మండలంలో అత్యంత వెనుకబడ్డ 15 గ్రామాలను ఎంపిక చేసి అక్కడ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లను నియమిస్తామన్నారు. ఈ సమన్వయకర్తలు ఆయా గ్రామాల్లో నిరుపేదలు ఎవరున్నారు, వారికి కావాల్సిన మౌలిక సదుపాయాలు, తదితర విషయాలపై సర్వే చేస్తారన్నారు. ఆర్థికపరమైన సమస్యలు ఉంటే కూడా ఫైనాన్షియల్ ఇన్ క్లూజివ్ ద్వారా, ప్రభుత్వ పథకాల పరంగా అర్హత కలిగిన వారిని గుర్తించి ఆర్థికంగా చేయూతనివ్వడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ఎంపిక చేసిన ఆయా గ్రామాల్లోని ప్రతి 25 కుటుంబాలకు ప్రత్యేకంగా ఒక కోఆర్డినేటర్ ను కూడా నియమించి వారికి రెండేళ్లపాటు జీతాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కోఆర్డినేటర్లు ఆయా కుటుంబాల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడేందుకు విధులు నిర్వర్తిస్తారన్నారు. ఈ కార్యక్రమంను విజయవంతం చేసేందుకు మండల




అధికారులను కూడా భాగస్వాములను చేసి ప్రణాళికతో ముందుకెళ్లనున్నట్లు చెప్పారు. సమన్వయకర్తలుగా ఆయా గ్రామాల్లోని మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు ఉంటారని లేదా కుటుంబ సభ్యురాలై ఉండాలని చెప్పారు. 22 నుంచి 40 ఏళ్ల మధ్యలో వయస్సు కలిగి ఉండాలని, కనీసం పదవ తరగతి ఉత్తీర్ణురాలై, గతంలో ఏవైనా ప్రభుత్వ శాఖల్లో రిసోర్స్ పర్సన్లు గా పనిచేసి, ప్రస్తుతం ఖాళీగా ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికైన సమన్వయకర్తలు లబ్ధిదారులకు కేవలం సలహాలు మాత్రమే ఇవ్వడం కాక సంబంధిత అంశాలపై ప్రయోగపూర్వకంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మైక్రో ఫైనాన్స్, సేవింగ్స్, క్రెడిట్ నిర్వహణ, తదితర అంశాలపై కూడా అవగాహన కలిగించాల్సి ఉందన్నారు. అలాగే సమన్వయకర్తలు తమకు కేటాయించిన ప్రాంతంలో ఉండే ఆయా కుటుంబాల ఇండ్ల సందర్శనలను రికార్డ్ చేయడం, సమావేశాలు, చర్చ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తెలంగాణ ఇన్ క్లూజివ్ ప్రోగ్రాంలో భాగంగా ఐదు ఏళ్ల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించడమే కాక ఎంపిక చేసిన ఆయా కుటుంబాలకు ప్రతి ఏడాది ఆర్థికపరమైన ఎదుగుదలకు ఇన్సెంటివ్స్, లోన్స్ ను ఇవ్వడం జరుగుతుందన్నారు. పేద ప్రజల మౌలిక వసతులు, ఆర్థికపరమైన, సామాజిక అవసరాలు బాగుపడేందుకు ఈ కార్యక్రమం తో పాటు ప్రభుత్వ పథకాల పరంగా పూర్తి స్థాయిలో సహాయ, సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత నూతన పథకంతో గట్టు మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందని, పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం తమ పూర్తి సహకారాన్ని అందిస్తుందని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## నారక్కపేటలో బడిబాటకు శ్రీకారం

# ప్రత్యేక నమోదు డ్రైవ్‌తో విద్యా చైతన్యం

**నల్లబెల్లి,ఏప్రిల్ 8 (నినాదం):**

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి తోడ్పడే లక్ష్యంతో నిర్వహిస్తున్న స్పెషల్ ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా నారక్క పేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీ ఎస్ )లో ఈరోజు బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో కరపత్రాలు డోర్ స్టిక్కర్లను విడుదల చేస్తూ విద్యాప్రాముఖ్యతను గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీ సదానంద మాట్లాడుతూ, ప్రతి బాలబాలికకు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా సమాజపు కర్తవ్యమని పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికి విద్య వెలుగులు చేరాలని, అందుకోసం తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమం అనంతరం ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలుసుకుని, విద్య ప్రాముఖ్యతను వివరించారు.



చిన్నారుల భవిష్యత్తు బలోపేతానికి ప్రభుత్వ పాఠశాలలు అందిస్తున్న సౌకర్యాలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, నాణ్యమైన బోధన వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా కరపత్రాలను అందజేసి, ఇండ్ల పై డోర్ స్టిక్కర్లు అంటించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దండెం సంపత్ ఉప సర్పంచ్ రాంబాబు ఏ ఏ పి సి చైర్మన్ హైమావతి పాల్గొని, గ్రామ ప్రజలు ఈ అవకాశాన్నివినియోగించుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు.పాఠశాల ఉపాధ్యాయులు కుమారస్వామి, సౌందర్య, శ్రీలత, కృష్ణ ఇతర సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో విద్యా చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# ఆస్పత్రిలో అస్తవ్యస్తంపై ఎమ్మెల్యే ఆగ్రహం

## ప్రధాన ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):**

జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులపై భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆసుపత్రి సూపరింటెండెంట్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఆయన ఆసుపత్రిని సందర్శించి, అన్ని విభాగాలను సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని క్యాజువలిటీ, ల్యాబ్ , ఏం.ఆర్.ఐ, ఔట్ పేషెంట్ గదులు పరిశీలించి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. క్యాజువాల్టీలో 6 మంచాలు మాత్రమే ఉన్నాయని అత్యవసరంగా ఒకే సమయంలో ఎక్కువ మంది రోగులు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్యులు తెలుపగా నూతనంగా 15 మంచలతో ఒక క్యాజువాల్టీ నిర్మాణం చేపడతామని ప్లానింగ్,అంచనాలు తయారు చేసి ఇవ్వాలని టి.జి.ఎం.ఐ.డి.సి అధికారులను ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి ల్యాబ్ ను పరిశీలించి అన్ని రకాలైన పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పారిశుద్యం సరిగా లేకపోవడం, వార్డులు పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటం గమనించిన ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు అందాల్సిన ప్రాథమిక సౌకర్యాలు సరిగా లేకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం వంటి అంశాలపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి నిర్వహణపై బాధ్యత వహిస్తున్న పర్యవేక్షకుడిని హెచ్చరించారు. ఆసుపత్రిలో పారిశుధ్యం, నిర్వహణ, సిబ్బంది సమయ పాలన మెరుగుపరచాలని ఆదేశించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తక్షణమే తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో పారిశుద్యాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, సిబ్బంది హాజరు, పనితీరుపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలోని మహిళా క్యాంటీన్ ను పరిశీలించి రోగి బంధువులతో మాట్లాడారు. క్యాంటీన్లో పరిశుభ్రత తో కూడిన నాణ్యమైన వంటకాలను అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే క్యాంటీన్లో టిఫిన్స్ రుచిచూశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్,అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్,ఆసుపత్రి పర్యవేక్షకులు డా రాజేంద్రప్రసాద్, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# ప్రపంచాన్ని బలి చేసిన ట్రంప్ యుద్ధోన్మాదం !

సంపాదకీయం

అమెరికా`ఇజ్రాయిల్ చేసిన యుద్ధంతో సాధించిందేమిటి? ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదేలు చేసిన ఈ ఇరు దేశాల నేతలు ఇప్పుడు చిద్విలాసంగానే ఉన్నారు. ఇరాన్‌ను సర్వనాశనం చేయాలని చూసి చేతులు కాల్చుకున్నారు. కానీ ప్రపంచ దేశాలు ఆయిల్, గ్యాస్ దొరక్క విలవిల్లాడాయి. ధరలు పెరిగాయి. విమానాలు రద్దయ్యాయి. ఎక్కడికి పోవాలన్నా విమాన ధరలు అందనంతగా పెరిగాయి. ఇంత విధ్వంసం చేసిన ట్రంప్ ..ఇప్పుడు తాత్కాలికంగా రెండు వారాలు యుద్ధాన్ని వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. నిజానికి శాశ్వతంగా యుద్ధాన్ని ఆపేసి, ఇరాన్ సహా నష్టపోయిన దేశాల పునర్నిర్మాణంలో పాల్గొనాలి. ఇరాన్ అధినేత ఖమేనీని అంతమొందించి, ఇరాన్‌పై బాంబు దాడులు చేసి సాధించింది మాత్రం శూన్యం. ఓ రకంగా చెప్పాలంటే ఈ యుద్ధంలో ట్రంప్ ప్రథమ దోషి. తరవాతి స్థానం నెతన్యాహూది. వీరి యుద్ధ కాంక్షకు, నిరంకుశ వైఖరికి ప్రపంచ దేశాలు అల్లాడాయి. బాంబు దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేసింది. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమైపోతోంది. చమురు ధరలు పెరిగాయి. చమురు అందకుండా పోయింది. నౌకలు ఎక్కడిక్కడే నిలిచి పోయాయి. డాలర్ల లెక్కలో ముడిచమురు ధరలు పెరిగిపోయాయి. దాని వెనువెంటనే ఇతర దేశాల కరెన్సీల, ముఖ్యంగా ఆసియా దేశాల కరెన్సీల విలువలు పడిపోవడం మొదలైంది. దీని ఫలితంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో కన్నా ఎక్కువ మోతాదులో మూడవ ప్రపంచ దేశాలలో ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. ఇలా ద్రవ్యోల్బణం పెరిగిపోవడం వలన ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. అందువలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆర్థికమాంద్య ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. చమురుకు కొరత ఏర్పడినందువలన ఎరువుల ఉత్పత్తి తగ్గిపోయింది. దాంతో ఆ ఎరువుల కొరత ఏర్పడింది. దాని ఫలితంగా ఆహారధాన్యాల ఉత్పత్తి దెబ్బ తింటోంది. ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో దుర్భర పరిస్థితుల మధ్య శ్రామిక ప్రజానీకం చిక్కుకుపోతున్నారు. ఇలా ట్రంప్ సాధించిన ఘనతలకు ఇవన్నీ నిదర్శనాలుగా చెప్పుకోవాలి. ఈ సంక్షోభానికి దారి తీసిన చట్టవిరుద్ధమైన, అనైతికమైన యుద్ధానికి ముగింపు తాత్కాలికం కారాదు. శాశ్వతంగా యుద్ధాన్ని ముగించేందుకు బేషరతుగా ట్రంప్ అడుగులు వేయాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చమురు చాలా చిన్న విషయమే అయినా, చమురు ధరల పెరుగుదల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత స్థాయిలో ప్రభావం చూపడం చూస్తున్నాం. ఎందుకంటే చమురు చుట్టే అన్నీ పెనవేసుకుని ఉన్నాయి. సామ్రాజ్యవాద విస్తరణ, ఆక్రమణ యత్నాలకు ప్రధాన కారణం ముడిపదార్థాల వి□ద అదుపు సంపాదిం చడమేనని ఇప్పుడు వేరుగా చెప్పాల్సిన పనిలేదు. వెనెజువెలా తరవాత ఇరాన్‌పై దాడి సులభంగా అవుతుందనుకున్న ట్రంప్‌కు ఇదొక పెద్ద షాక్. ఇకముందు ప్రపంచ దేశాలపై దాడులు చేస్తే ఆయా దేశాలు ఎదురుదాడికి సిద్దంగా ఉంటాయని ట్రంప్ బుద్ధి తెచ్చుకోవాలి. ప్రస్తుత పరిణామాలు ఈ విషయాన్నే బలపరుస్తున్నాయి. ప్రపంచ చమురు ఉత్పత్తుల్లో`ముడి చమురు మాత్రమే కాక దాని నుంచి వచ్చే వివిధ ఉత్పత్తులన్నీ కలుపుకుని`20 శాతం మాత్రమే హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా అవుతుంది. రవాణాకు ఆటంకం ఏర్పడింది. ఇంత చిన్న విషయానికే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత పెద్ద స్థాయిలో సంక్షోభం తలెత్తిందంటే చమురు వంటి ముడిసరుకు ఎటువంటి కీలక పాత్ర పోషిస్తోందో బోధపడుతోంది. అంత కీలకమైన పాత్ర పోషించగలగడానికి కారణం చమురు విశ్వవ్యాప్త వాణిజ్య వస్తువు కావడమే అని గుర్తించాలి. అది ఆర్థిక ఇబ్బందులను స□ష్టించగలిగే అవకాశం ఎక్కువగా కలిగి ఉంది. దాని ధర పెరగడం వలన కలిగే ద్రవ్యోల్బణ ప్రభావం అంతే తీవ్రంగా ఉంటుంది. ముడి చమురు ధరలో 10 శాతం పెరుగుదల ఉంటే కలిగే ప్రభావం తక్కువగా ఉంటుంది. ముడిచమురు ధరలో వచ్చే మార్పు ఆర్థిక వ్యవస్థ వి□ద ఇంతటి తీవ్ర ప్రభావాన్ని కలిగించగలదని ఈ నెల రోజుల్లో మనకు అనుభవంలోకి వచ్చింది.డాలర్ విలువ ముడిచమురు విలువతో ముడిపడిపోయి వుంది. అందుకే డాలర్ ఆధిపత్యం కొనసాగేందుకు అమెరికా డాలర్లను ముద్రించి విడుదల చేస్తోంది. ఆ డాలర్లను స్వీకరించడానికి, వాటి విలువను అంగీకరించడానికి ప్రపంచం కూడా సుముఖంగానే ఉంది. అందుచేత ఇప్పుడు ప్రపంచం అంతా డాలర్లు ఎక్కడబడితే అక్కడ ఉన్నాయి. ఈ పరిస్థితిలో డాలర్ ప్రమాణం ప్రశ్నార్ధకంగా మారే పరిస్థితి దాపురిస్తే మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచ స్థిరత్వమే ప్రమాదంలో పడుతుంది. అందుచేత చమురు`డాలర్ ప్రమాణాన్ని నిలబెట్టుకోవడం మరింత కీలకంగా మారింది. అలా నిలబెట్టుకోడానికే చమురును ఉత్పత్తి చేసే దేశాల వి□ద రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడానికి అమెరికా పూనుకుంటోంది. అందుకే దాడులుకు తెగిస్తోంది. ముడి చమురుపై పెత్తనం కోసం చేస్తున్న యుద్ధంగా దీనిని యూడాలి. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని గద్దె దించేసి తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలనన్న ధీమాతో అమెరికా ఇరాన్ వి□ద దాడికి దిగింది. అయతుల్లా ఆలీ ఖమేనీతో సహా ఇరాన్ ఉన్నతాధికారులను అంతం చేసి,ఇరాన్‌ను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకోవాలని, అందుకు ఇజ్రాయిల్‌ను వాడుకోవాలని అమెరికా చూసింది. తన డాలర్ సర్వాధిపత్యాన్ని మరింత బలపరుచుకోవాలన్న ఉద్దేశంతో అమెరికా చేసిన ఈ ప్రయత్నం బెడిసి కొట్టిందనే చెప్పాలి. అయితే ప్రపంచం మాత్రం మూల్యం చెల్లించుకుంది. ఇప్పటికైనా ట్రంప్ కళ్లు తెరవాలి. యుద్ధోన్మాదం నుంచి బయట పడాలి.

# 15 రోజుల సీజ్‌ఫైర్



## ఇరాన్‌తో యుద్ధానికి పక్షం విరామం ప్రకటించిన ట్రంప్

## హర్మూజ్‌పై సుంకాలు విధింపును సమర్థించుకున్న ఇరాన్

**వాషింగ్టన్,ఏప్రిల్8(నినాదం):**

**గత 40 రోజులుగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. అమెరికా`ఇరాన్ మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. ఇరాన్‌పై దాడులను రెండు వారాల పాటు ఆపేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్ `అమెరికా, ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం తాత్కాలికంగా నిలిచిపోయింది.**

ఇరాన్, అమెరికాల మధ్య 15 రోజుల సీజ్ ఫైర్ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై ట్రంప్ తన సొంత సోషల్ వి□డియా 'ది ట్రూత'లో వరుస పోస్టులు పెడుతున్నారు. తాజాగా, 'ప్రపంచ శాంతికి ఇది గొప్ప రోజు. ఇరాన్‌తో పాటు ఇతర దేశాలు కూడా శాంతి కోరుకుంటున్నాయి.

హోర్ముజ్ జలసంధిలో ట్రాఫిక్ క్లియరెన్స్‌కు సహకరిస్తాం' అని రాసుకొచ్చారు. అమెరికా సీజ్ ఫైర్ నిర్ణయానికి ఇజ్రాయెల్ కూడా మద్దతు తెలిపింది. లెబెనాన్ విషయంలో మాత్రం వెనక్కు తగ్గేది లేదని స్పష్టం చేసింది. ఇరాన్, అమెరికా దేశాల మధ్య సీజ్ ఫైర్ ఒప్పందం జరిగినా కూడా హోర్ముజ్ విషయంలో ఇరాన్ మాత్రం వెనక్కు తగ్గటం లేదు. ఇప్పటికీ ఇరాన్ నియంత్రణలోనే హోర్ముజ్ జలసంధి ఉంది. హోర్ముజ్‌లో షిప్పుల నుంచి ఇరాన్ భారీ మొత్తంలో టోల్ వసూలు చేస్తోంది. టోల్ ఫీజు ఆదాయాన్ని పునర్నిర్మాణానికి ఖర్చు చేస్తామని అంటోంది. పాకిస్థాన్ ప్రధాని సూచనల మేరకే గడువును పొడిగించినట్టు ట్రంప్ తెలిపారు. అయితే కాల్పుల విరమణ ఒప్పందానికి ఇరాన్ అంగీకరించడం వెనుక చైనా కీలక పాత్ర పోషించిందని వార్తలు వస్తున్నాయి. 'కాల్పుల విరమణపై చర్చలు జరపడానికి టెహ్రాన్‌ను ఒప్పించడంలో చైనా ప్రమేయం ఉందా' అని విలేకరులు ప్రశ్నించినపుడు 'అవుననే అనుకుంటున్నా. నేను కూడా విన్నాను' అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఏడాది మే నెలలో చైనా పర్యటనకు ట్రంప్ వెళ్లబోతున్నారు. ఆ సమయం లోపునే ఈ యుద్ధం ముగిసిపోవాలని చైనా భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పాకిస్థాన్, టర్కీ, ఈజిప్టు వంటి మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌ను శాంతి మార్గం వైపు నడిపించడంలో చైనా నిశబ్దంగా పని చేసిందని వార్తలు వస్తున్నాయి. ఇరాన్ యుద్ధంలో బీజింగ్ పాత్రపై చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటనా జారీ చేయలేదు. నిజానికి ఈ యుద్ధం ఆగడం చైనాకు కూడా చాలా కీలకం. ఎందుకంటే చైనాకు ఇరాన్ ప్రధాన ఆయిల్ సరఫరాదారు. హోర్ముజ్ జలసంధి మూసి వేసి ఉండడం చైనా ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలోనే శాంతి చర్చల విషయమై చైనా అధికారులు నేరుగా ఇరాన్ నాయకులతోనే సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. ఏదేమైనా, భవిష్యత్తులో ప్రపంచ రాజకీయాల్లో చైనా ప్రభావం మరింత పెరుగుతుందనేందుకు ఈ పరిణామం కీలక సంకేతం.

### కాల్పుల విరమణతో ప్రపంచ శాంతి

### ఇదో గొప్ప సుదినమంటూ ట్రంప్ పోస్ట్

ఇరాన్‌తో కాల్పుల విరమణపై అమెరికా డీల్ కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో ప్రకటన చేశారు. ప్రపంచ శాంతికి ఇది గొప్ప దినం అన్నారు. ఇరాన్ ఇదే కోరుకుంటోందన్నారు. తాజా వార్‌లో ఇరాన్ చాలా దెబ్బతిన్నట్లు చెప్పారు. హోర్ముజ్ జలసంధిలో మళ్లీ చమురు నౌకల సందడి పెరుగుతుందని, దీనికి అమెరికా సహకరిస్తుందన్నారు. చాలా పాజిటివ్ యాక్షన్ ఉండబోతుందన్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదిస్తారని, ఇరాన్ మళ్లీ పునర్ నిర్మాణ పనులు మొదలుపెడుతుందన్నారు. ఇక రాబోయే రోజుల్లో పశ్చిమాసియాలో స్వర్ణ యుగం ఉండబోతుందన్నారు. తనకు నమ్మకం ఉందన్నారు. రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందాన్ని విక్టరీగా చెప్పుకున్నారు. ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇండోనేషియా స్వాగతించింది. ఇరు దేశాలు సార్వభౌమత్వాన్ని గౌరవించాలని పేర్కొన్నది. దౌత్యం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చు అని ఇండోనేషియా విదేశాంగ శాఖ ప్రతినిధి యెన్నె మివాంగ్‌కాంగ్ తెలిపారు.

### ఇరాన్ నుంచి సురక్షితంగా వీడండి

**భారత ప్రజలకు కేంద్రం అడ్వయిజరీ**

**న్యూఢిల్లీ :**

ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం మరోసారి అడ్వైజరీ జారీ చేసింది. వెంటనే ఆ దేశం నుంచి బయటపడాలని సూచించింది. ప్రస్తుత పరిణామాల ద□ష్ట్యా ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. రాయబార కార్యాలయాన్ని ముందుగా సంప్రదించకుండా.. ఏ అంతర్జాతీయ సరిహద్దు సవి□పంలోకి రావొద్దని పౌరులను హెచ్చరించింది. అలాగే కొన్ని హెల్ప్‌లైన్ నంబర్లను షేర్ చేసింది. ఇరాన్`అమెరికా (ఎస జీని`జ±ం) రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఈ సూచనలు జారీ కావడం గమనార్హం. నిన్న రాత్రి కూడా కేంద్ర విదేశాంగశాఖ అడ్వైజరీ జారీ చేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. ఇళ్లల్లోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్తుల భవనాలకు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం యుద్ధం తాత్కాలికంగా ఆగడంతో స్వదేశానికి రావాలనుకునేవారికి ఇదొక అవకాశంగా మారింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులకు ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. అవసరమైతే భారత రాయబార కార్యాలయం సహాయం తీసుకోవాలని తెలిపింది. తాము సూచించిన మార్గాల్లో మాత్రమే దేశాన్ని వీడాలని ఎంబసీ ఆదేశించింది. ఎంబసీని సంప్రదించకుండా.. పర్మిషన్ తీసుకోకుండా అంతర్జాతీయ సరిహద్దుల వద్దకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈ మేరకు ఎంబసీ బుధవారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది.

### యుద్ధ విరమణతో మార్కెట్లకు జోష్

### భారీ లాభాల్లో ప్రారంభం అయిన దేశీయ సూచీలు

ఇరాన్‌పై రెండు వారాల పాటు దాడులు చేయబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం అంతర్జాతీయ మార్కెట్లలో ఫుల్ జోష్ తీసుకొచ్చింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు ధరలు కూడా భారీగా దిగి వచ్చాయి. ఈ నేపథ్యంలో దేశీయ సూచీలు కూడా భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ బలపడింది. సెన్సెక్స్, నిఫ్టీ మూడు శాతానికి పైగా లాభంతో ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం దాదాపు



అన్ని రంగాలూ లాభాల్లోనే కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (74,616)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 2500 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ జోరు కొనసాగుతోంది. చాలా రోజుల తర్వాత 77 వేల మార్క్ దాటింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 2670 పాయింట్ల లాభంతో 77,286 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా లాభాల బాటలోనే సాగుతోంది. ప్రస్తుతం 777 పాయింట్ల నష్టంతో 23,900 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో అశోక్ లేలాండ్, ప్రెస్టీజ్ ఎస్టేట్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మదర్సన్, ఎల్ అండ్ టీ ◌్గ□నాన్స్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . ఆయిల్ ఇండియా, నాల్కో, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, సన్ ఫార్మ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1843 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 2473 పాయింట్ల లాభంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.55గా ఉంది.



# అలుపెరుగని కమ్యునిస్టు యోధుడు చంద్ర రాజేశ్వరరావు

### ఏప్రిల్ 9... చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి

**నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, ఏళ్ళతరబడి ఉద్యమాల్లో, అజ్ఞాత వాసంలో గడిపిన అలుపెరుగని కమ్యునిస్టు నిస్వార్థ పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు. కమ్యూనిస్టు పార్టీకి ఆరున్నర దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో సేవలందించిన నిబద్ధత కలిగిన మహా నేత రాజేశ్వరరావు.**



భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి 28 సంవత్సరాల సుదీర్ఘ కాలం నేతృత్వం వహించిన రాజేశ్వరరావు జీవితం సైద్ధాంతిక నిబద్ధతకు, నిజాయితీకీ నిలువుటద్దం. చంద్ర రాజేశ్వరరావు భారత కమ్యూనిస్టు పార్టీ తొలితరం అగ్రనాయకుల్లో ఒకరు. పేరుకు తగినట్టుగానే ప్రత్యర్థులపై చంద్ర ప్రచండత్వం ప్రదర్శించేవారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధులతో మమేకమైన కమ్యూనిస్టు ఆయన. ఎంతటి వారితో నైనా తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించేవారు. నెహ్రూ, ఇందిరాగాంధీలు తీసుకున్న నిర్ణయాల్లో ప్రజోపయోకరాలను సమర్థించినా, నిరంకుశ చర్యలను వ్యతిరేకించిన నిష్పక్షపాతి ఆయన.

పీడిత, తాడిత జనోద్ధరణ కోసం ఎంతో ఉజ్వలమైన భవిష్యత్‌ను వదులు కుని కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన ఆయన పేదల హృదయాల్లో చిర స్థాయిగా నిలిచారు. పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, తరిమెల నాగిరెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి, తదితర పార్టీ అగ్రనాయకులతో కలిసి, దశాబ్దాల పాటు రాష్ట్రంలోనే కాక, దేశంలోని పలు ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేశారు.

కృష్ణా జిల్లా చల్లపల్లి మండలంలోని మంగళాపురం గ్రామంలో 1914 జూన్ ఆరవ తేదీన పెద్ద భూస్వాముల కుటుంబంలో జన్మించిన రాజేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీలో చేరిన తరువాత ఆ భూస్వాములకు వ్యతిరేకంగా, భూమి లేని నిరుపేదల తరఫున దశాబ్దాలపాటు పోరాటం జరిపారు.

రాజేశ్వరరావు ప్రాథమిక విద్యాభ్యాసం మంగళాపురంలో, సెకండరీ విద్య చల్లపల్లిలోనూ సాగింది. బందరు హిందూ స్కూలులో ఎస్సెస్సెల్సీ పూర్తిచేశారు. విద్యార్థి దశలోనే రాజేశ్వరరావు క్రీడాకారునిగా, పేదల పాలిట ఆత్మీయునిగా పేరొందారు. మహాత్మా గాంధీ పిలుపుపై సాగిన ఉప్పు సత్యాగ్రహంలో వలంటీర్‌గా పని చేశారు. యుక్తవయసులోనే విప్లవ భావాల పట్ల ఆకర్షితులయ్యారు. మహాత్మాగాంధీ ఉద్యమాల్లో పనిచేస్తున్నా, విప్లవ కిశోరాలైన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ వంటివారి పట్ల ఆరాధనా భావాన్ని పెంచుకున్నారు. బెనారస్ హిందూ యూనివర్శిటీలో చదువుకుంటున్న రోజుల్లోనే ఆయన హిందూ, ముస్లిం ఐక్యత కోసం ఎంతోకృషి చేశారు. కమ్యూనిస్టు నాయకులను ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం మీరట్ కుట్ర కేసులో ఇరికించి జైళ్ళలో పెట్టినప్పుడు వారు విడుదల చేసిన ప్రకటన రాజేశ్వరావును ఉత్తేజపర్చింది. వామపక్ష భావాలున్న విద్యార్థులందరినీ ఐక్యపర్చి సాటి విద్యార్థులతో కలిసి ఒక స్టడీ సర్కిల్‌ని ఏర్పాటు చేశారు. తరువాత అది 'యంగ్ కమ్యూనిస్టు లీగ్'గా అవతరించింది.

బెనారస్ హిందూ యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లోనే మతవాద, మితవాద వర్గాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి రాజేశ్వరరావు. తరచుగా ఘర్షణలకు దిగడం, కమ్యూనిస్టు వర్గానికి నాయకత్వం వహించడంతో బిఎస్సీ పూర్తి కాకముందే ఆయన యూనివర్శిటీ నుంచి టీసీ తీసుకుని బయటికి వచ్చారు. బెనారస్‌లో ఉండగానే ఆయన లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ రష్యా సందర్శించి వచ్చిన తరువాత సోషలిజం, స్వాతంత్య్ర పోరాటంలో కార్మిక, కర్షక పాత్ర, వర్గ సంఘాలు, వర్గ పోరాటాల పేరిట రాసిన వ్యాసాలు రాజేశ్వరరావును విశేషంగా ఆకర్షించాయి.అదే సందర్భంలో ఆయన మహాత్మా గాంధీని కలిసిన విద్యార్థి బృందంలో ఉన్నారు. తరువాత ఆయన విశాఖలో మెడిసిన్‌లో చేరినా, ఆయన కమ్యూనిస్టు భావాల ప్రచారానికి నిడమర్తి ఉమారాజేశ్వరరావు ప్రభృతులతో కలిసి స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేశారు. కమ్యూనిస్టు భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఉద్యమంలో చురుకుగా పాల్గొనడం వల్ల ఆయన చదువు బెనారస్‌లోనూ, విశాఖలోనూ సవ్యంగా సాగలేదు.

తండ్రి అభిమతానికి వ్యతిరేకంగా ఆయన సావిత్రమ్మతో వివాహాన్ని అతి నిరాడంబరంగా దండల మార్పుతో చేసుకున్నారు. వారి వివాహానికి ప్రముఖ స్వాతంత్య్ర యోధుడు మద్దూరి అన్నపూర్ణయ్య పెళ్ళిపెద్దగా వ్యవహించారు. సావిత్రమ్మ కూడా భర్త మార్గంలోనే కమ్యూనిస్టు ఉద్యమం ప్రచారం కోసం జీవితాంతం కృషిచేశారు. వివాహానికి గుర్తుగా మెడలో వేసుకున్న గొలుసు రాయిని తీయించి ఎర్ర నక్షత్రాన్ని వేసుకోవడం ఆమె నిబద్ధతకు నిదర్శనం. పార్టీ నిర్ణయం మేరకు పూర్తి కాల కార్యకర్తగా పనిచేయడం కోసం ఆమె శాంతినికేతన్‌లో చదువు కోవాలనే ఆకాంక్షను బలవంతంగా అణగ దొక్కుకున్నారు.

కృష్ణా జిల్లాలో కమ్యూనిస్టుపార్టీ విస్తరణకు రాజేశ్వరరావు దంపతులు విశేషంగా కృషిచేశారు. కార్మిక, కర్షక సంఘాలను ఏర్పాటు చేసి, మంగళాపురం కూలీల పోరాటానికి, చల్లపల్లి జమిందారు అక్రమాలపై ఉద్యమానికి నేతృత్వం వహించారు. కృష్ణాజిల్లా తిరువూరు తాలూకాలో నైజాం సరిహద్దున ఉన్న తునికిపాడుకు వచ్చిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి ప్రభృతులు నైజాంలో పరిస్థితి గురించి వివరించారు. ఆ క్రమంలోనే రాజేశ్వరరావుకు... ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చిర్రావూరి లక్ష్మీనరసయ్య ప్రభృతులు కూడా రావడంతో వారందరితో రాజేశ్వరరావుకు పరిచయాలు ఏర్పడ్డాయి. క్రమంగా తెలంగాణాలో అనేక సార్లు పర్యటించి తెలంగాణలో పార్టీ నిర్మాణానికీ, భువనగిరి ఆంధ్ర మహాసభ నిర్వహణకు తోడ్పడ్డారు. తెలంగాణా కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకులను సమన్వయ పర్చడంలో,సాయుధ పోరాటంలో కీలకపాత్ర వహించారు.

భారత విప్లవోద్యమం గురించి స్టాలిన్‌తో చర్చించేందుకు అజయ్ ఘోష్, ఎస్ఏ డాంగే, బసవ పున్నయ్యలతో పాటు రాజేశ్వరరావు మాస్కో వెళ్ళారు. రాజేశ్వరరావు ఎంత పెద్ద నాయకుడైనా ఏమాత్రం అభిజాత్యాన్ని ప్రదర్శించకుండా, నిరంతరం ఏదో తెలుసు కోవాలనే తపనతో ఉండేవారు. పుచ్చలపల్లి సుందరయ్య పట్ల ఎంతో గౌరవం ఉన్నా, అవిభక్త కమ్యూనిస్టు పార్టీ చీలినప్పుడు ఆయన భారత కమ్యూనిస్టు పార్టీకి నేతృత్వం వహించారు. రాజేశ్వరరావు సిద్ధాంతాలతో ఏనాడూ రాజీ పడలేదు. ఇందిర ప్రభుత్వం తీసుకున్న ప్రగతి శీల చర్యలకు మద్దతు ఇస్తూనే, ఆమె నిరంకుశ పోకడలను తీవ్రంగా వ్యతిరేకించే వారు. 1970వ దశకంలో దేశవ్యాప్తంగా కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో సాగిన భూ ఆక్రమణ ఉద్యమం పార్టీ ప్రతిష్ఠను పెంచి, అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ ఉద్యమం విజయవంతం కావడంలో రాజేశ్వరరావు పాత్ర గణనీయం. ఆయన పిత్రార్జిత ఆస్తిలో తన వాటాను పూర్తిగా పార్టీకోసం వెచ్చించారు. పార్టీకి ఆయన విరాళంగా ఇచ్చిన లక్షలాది రూపాయిలతో ఆరోజుల్లో వందలాది ఎకరాలను కొనగలిగి ఉండేవారనేది వాస్తవం.

ఆయన ఢిల్లీ వెళ్ళినా,ఎక్కడికి వెళ్ళినా పార్టీ కార్యాలయాల్లోనే బస చేయడం, తన బట్టలను తానే ఉతు క్కోవడం నిరాడంబర జీవితం తానికి ప్రబల నిదర్శనాలు. అక్టోబర్ విప్లవం 60వ వార్షికోత్సవాల సందర్భంగా భటిండాలో జరిగిన పార్టీ మహాసభలో ఆమోదించిన తీర్మానం చరిత్రాత్మకమైనది. రాజేశ్వరరావు సోవియట్ యూనియన్‌లో గోర్బాచెవ్ ప్రవేశపెట్టిన సహకార వ్యవసాయం, కాంట్రాక్ట్ సేద్య విధానాలను రాజేశ్వరరావు సమర్థించారు.

సోవియట్ యూనియన్ కుప్పకూలిన తరువాత సంభవించిన పరిణామాల పట్ల ఆయన చివరి రోజుల్లో ఎంతో కలత చెందారు.

ప్రపంచంలో ఎక్కడ ప్రగతి శీల పోరాటాలు జరిగినా వాటికి ఆయన మద్దతు ప్రకటించేవారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు అనేక సమస్యలపై ఒకే అభిప్రాయాన్ని కలిగి ఉన్నప్పటికీ, సిపిఎం వ్యతిరేక ధోరణి వల్ల ఉభయ కమ్యూనిస్టు పార్టీల పునరేకీకరణ ప్రక్రియ ఆలస్యమవుతోందని ఆవేదన చెందేవారు.

ఆయన ఎన్నో పురస్కారాలను పొందినా,1994 లో పొందిన సోవియట్ యూనియన్ ఆర్డర్ ఆఫ్ లెనిన్ పురస్కారం అత్యంత ప్రతిష్ఠాకరమైనది. సుదీర్ఘకాలం పార్టీకోసం అహర్నిశలు కృషిచేసిన రాజేశ్వరరావు 80 వ ఏట 1994 ఏప్రిల్ 9వ తేదీన హైదరాబాద్‌లో కన్నుమూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# కాళేశ్వరం మోటర్లను దెబ్బతీసే కుట్రలు

### సరైన మెయింటెనెన్స్ లేకుండా చేస్తే ఎలా?

### మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

హైదరాబాద్ : కాళేశ్వరానికి సంబంధించి భారీ నీటి పారుదల మోటార్లను ధ్వంసం చేసే కుట్ర సాగుతోందంటూ కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆరఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజమెత్తారు. భారీ నీటిపారుదల మోటార్లను ఇష్టానుసారంగా ఆన్, ఆఫ్ చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.ప్రాజెక్టుల్లోని భారీ మోటార్లను నిబంధనలకు విరుద్ధంగా పదే పదే ఆన్, ఆఫ్ చేస్తూ అశా□స్త్రీయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలా చేస్తే వైబ్రేషన్స్ వచ్చి పంపులు, ఇంప్లర్స్, మోటార్స్ పాడయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గత బీఆరఎస్ ప్రభుత్వంపై నెపం నెట్టేందుకే ఉద్దేశపూర్వకంగా మోటార్లను పాడు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పాలనాపరమైన నిర్లక్ష్యమా లేక కావాలనే చేస్తున్న కుట్రనా అని నిలదీశారు. భారీ మోటార్లు నిరంతరాయంగా నడిచేలా డిజైన్ చేసినవి, పదే పదే ఆపితే తీవ్ర నష్టం తప్పదని హరీశ్‌రావు హెచ్చరించారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులను ఇలా నిర్లక్ష్యంగా వాడటం శోచనీయమని మండిపడ్డారు. చందలాపూర్ సహా ప్యాకేజీ 6, 8, 10, 11, 12 లలో మోటార్ల ఆపరేషన్ తీరు తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. తక్షణమే మోటార్లను పదే పదే ఆన్, ఆఫ్ చేసే అశా□స్త్రీయ విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం, డిజైన్ కు అనుగుణంగా నిరంతరాయంగా పంపులు నడిపించాలని తెలిపారు. bwరాజకీయాల కోసం తెలంగాణ రైతుల జీవనాడి అయిన ప్రాజెక్టులతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు.



# ప్రతిరోజూ రెండు కివీ పండ్లు తింటే..!



నేటి ఉరుకుల పరుగుల జీవితం, మారిన ఆహారపు అలవాట్ల వల్ల మలబద్ధకం, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలు ఇంటింటికీ సాధారణమైపోయాయి. ఈ సమస్యల నుండి ఉపశమనం పొందడానికి చాలామంది రకరకాల మందులు వాడుతుంటారు. అయితే వీటన్నింటికంటే ప్రతిరోజూ రెండు కివీ పండ్లు తినడం వల్ల అద్భుతమైన ఫలితాలు ఉంటాయని తాజా వైద్య పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. సుమారు 184 మందిపై నిర్వహించిన ఒక అధ్యయనంలో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పరిశోధకులు వీరిని రెండు బృందాలుగా విభజించి, ఒక బృందానికి ప్రతిరోజూ రెండు కివీ పండ్లు, మరో బృందానికి ఇసబ్గోల్ లేదా సైలియం పొట్టు ఇచ్చారు. నాలుగు వారాల తర్వాత చూస్తే.. కివీ పండ్లు తిన్నవారిలో జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా, కడుపునొప్పి, ఒత్తిడి వంటి సమస్యలు గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు.

**జీర్ణ వ్యవస్థకు సంజీవని**

కివీ పండులో ఉండే యాక్టినిడిన్ అనే ఎంజైమ్, అధిక ఫైబర్ కంటెంట్ ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇందులో ఉండే కరిగే ప్రీబయోటిక్ ఫైబర్ ప్రేగులలోని మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు దోహదపడి, కడుపును ఆరోగ్యంగా ఉంచుతుంది.

**రోగనిరోధక శక్తికి కేరాఫ్ అడ్రస్**

కేవలం జీర్ణక్రియకే కాదు, కివీ పండు రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా మేటి. కివీలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది జలుబు, దగ్గు వంటి అంటువ్యాధుల నుండి రక్షణ ఇస్తుంది. రోజూ రెండు గోల్డెన్ కివీ పండ్లు తినే వృద్ధులలో గొంతు నొప్పి, ముక్కు దిబ్బడ వంటి సమస్యలు తక్కువగా ఉంటాయని, ఒకవేళ అనారోగ్యం సోకినా వారు చాలా వేగంగా కోలుకుంటారని అధ్యయనం తేల్చింది. ఇందులో ఉండే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది.

**బరువు నియంత్రణ:**
తక్కువ కేలరీలు, ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఎంపిక.

**కంటి చూపు:**
కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ల్యూటిన్, జీక్సాంథిన్ వంటి మూలకాలు కివీలో ఉన్నాయి.

**చర్మ సౌందర్యం:**
యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని కాంతివంతంగా మార్చుతాయి.

**జాగ్రత్తలు తప్పనిసరి**

కివీలో ఎన్ని ప్రయోజనాలు ఉన్నా, కొందరికి ఇది అలెర్జీని కలిగించవచ్చు. నోరు వాపు లేదా దురద వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. మొదట్లో తక్కువ పరిమాణంలో తింటూ మీ శరీరానికి ఇది పడుతుందో లేదో చూసుకోవడం మంచిది.

## గొల్లపల్లి సభకు న్యాయస్థానం అనుమతి ఇవ్వడం ప్రజాస్వామ్యంలో శుభపరిణామం

-హరీష్ రావు పర్యటనతో ప్రభుత్వ గుండెల్లో గుబులు.. -ప్రజాధనాన్ని కాపాడడానికి గొల్లపల్లి సభ..: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 8 (నినాదం)** గొల్లపల్లి సభకు న్యాయస్థానం అనుమతి ఇవ్వడం ప్రజాస్వామ్యంలో శుభపరిణామం అని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి హరీష్ రావు ఏదుల మండలం గొల్లపల్లి పర్యటనకు రానుండడంతో ప్రభుత్వ గుండెల్లో గుబులు మొదలైందని ప్రజాధనాన్ని కాపాడడానికి గొల్లపల్లి సభ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన చెప్పారు.సభకు న్యాయస్థానం అనుమతి ఇవ్వడం నాయకులకు, అధికారులకు చెంప పెట్టు అని పేర్కొన్నారు.సభలు, సమావేశాలు పెట్టుకోవడం ప్రజల ప్రాథమిక హక్కుని, 14ఏండ్లు శాంతియుతంగా రక్తపు చుక్క రాకుండా ఉద్యమం నడిపించామని చెప్పారు. సభలు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం ఎందుకు బయపడుతుందని,ప్రజల అభీష్టం మేరకు ప్రభుత్వాలు పనిచేయాలని సూచించారు.ప్రజాధనం వృథా కాకూడదనేది మా అభిప్రాయమని,ప్రజాస్వామ్యంలో నియంతృత్వం పనిచేయదని అన్నారు. వాగ్దానాలు నెరవేర్చడం చేతకాదు కానీ నిరసనను తొక్కి వేయడం న్యాయం కాదని, లగచర్లలో రైతుల తిరుగుబాటుకు రేవంత్ రెడ్డి తోక ముడిచాడని ఆయన గుర్తు చేశారు.రైతు దీక్షలకు మాజీ మంత్రి హరీష్ రావ్ సంఘీభావం తెలపనున్నారని,రైతులకు బాసటగా నిలవడానికి ఉద్యమం రాష్ట్ర స్థాయికి తీసుకుపో తామని ఆయన అన్నారు.సభకు అనుమతించి అకారణంగా అనుమతిని పోలీస్ అధికారులు రద్దు చేశారని, ఉద్యమాలు బిఆర్ఎస్ పార్టీకి కొత్తకాదని, ఏనాడు శాంతి భద్రతలకు భంగం కలిగించలేదని ఆయన వివరించారు.సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం ప్రతిపక్ష బాధ్యత అని, పిల్లి శానార్థాలు పెడితే ఉట్టి తెగిపడదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి ప్రజా సమస్యలు తెలుసుకోవడంలో ఓపిక కావాలని, ప్రతిపక్ష, ప్రజా సంఘాల ప్రశ్నలకు సమాధానం ప్రభుత్వం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నించే మేధావులు ఎక్కడ ఉన్నారని, పోలీస్ అధికారులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరించడం పద్ధతి కాదని అన్నారు.ప్రభుత్వ పెద్దలు అరాచకానికి పాల్పడుతున్నారని,గజ్వేల్ లో కెసిఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి చేయడం అమానుషమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రశ్నించే గొంతుకలను ఆపడం నియంత తనానికి నిదర్శనమని,100 రోజులు దీక్షలు చేసిన రైతులకు అభినందనలు మీకు మేము అండగా ఉంటామని నిరంజన్ రెడ్డి చెప్పారు. ప్రాజెక్టు కట్టాలి అంటే 80శాతం ప్రజలు రాజ్యాంగం ప్రకారం ఏకాభిప్రాయానికి రావాలని, రైతు భరోసా, రైతు బీమా, మద్దతు ధర, సంక్షేమ పథకాల అమలుతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగు పడిందని చెప్పారు. భూసేకరణ అనేది ప్రభుత్వానికి సవాల్ అనీ, తక్కువ ఖర్చుతో బహుళ ప్రయోజనాల కోసం కెసిఆర్ ప్రాజెక్టుల రూపకల్పన చేశారని చెప్పారు. కె.ఎల్.ఏ పథకం 1984లో పుట్టపాగ మహేంద్ర నాథ్ 30లక్షల ఆయాకట్టుకు ప్రయోజనం కలిగే విధంగా రూపొందించండి అని అనేడే వినతి చేశారని,16జూన్ 1983 లో ఎన్.టి.ఆర్ సమగ్ర సర్వే కోసం ఆదేశించారని చెప్పారు. కె.ఎల్. ఐ నుండి 2లక్షల 50వేల ఎకరాలకు సాగు కోసం 3 రిజర్వాయర్లు కట్టాలని 1998జులైలో చంద్రబాబు శంకు స్థాపన చేశారని చెప్పారు. ఏల్లూరు, గుడిపల్లి, జొన్నల బొగడ లిఫ్టులు కేవలం 4టి.ఏం.సి సామర్థ్యం మాత్రమేని,కెసిఆర్ ఉద్యమంతో ప్రాజెక్టుల పూర్తి కోసం పోరాటం చేశామన్నారు.
వై.ఎస్.ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పోతిరెడ్డి పాడు ద్వారా 55 క్యూసెక్కుల నీళ్లు తరలించుకుపోయారని,పాలమూర్ ప్రాజెక్టులను వై.ఎస్.ఆర్ పడావ్ పెట్టారని చెప్పారు.ప్రాజెక్టుల కోసం కెసిఆర్ నేతృత్వంలోని ఆరుగురు మంత్రులు రాజీనామాతో పోరాటానికి సిద్ధమైనారని ఆయన గుర్తు చేశారు.2800కోట్లతో కెసిఆర్ కె.ఎల్.ఐ ని 4ఏండ్లలోపూర్తి చేశారని, కె.ఎల్.ఐ కింద 5లక్షల ఎకరాల సాగుకు ప్రజల డిమాండ్ ప్రారంభమైందని అన్నారు.కెసిఆర్ వరద జలాలను 25 టి.ఏం.సి ల నుండి 40 టి.ఎం.సి లకు పెంచడానికి కృషి చేశారని, 40 టి.ఎం.సి లు పూర్తి వాడకానికి రిజర్వాయర్లుకు డి.పి.ఆర్ కోసం కెసిఆర్ ఆదేశించారని పేర్కొన్నారు. అప్పటికే పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభం అయ్యిందని,ఏదుల రిజర్వాయర్ ద్వారా 7 టి.ఎం.సి ల సామర్థ్యంతో రైతులకు ప్రయోజనం చేపడుతుందన్నారు.డి5, డి8 కాలువలను ఆధునీకరించడం ద్వారా గణప సముద్రం, బుద్దారం ద్వారా మొత్తంగా 2లక్షల ఎకరాలకు సాగు నీళ్లు అందించామని,
2018 సెప్టెంబర్ లో ప్రభుత్వం గొల్లపల్లి, చీర్కపల్లి రిజర్వాయర్ అవసరం లేదని తిరస్కరించిందని ఆయన గుర్తు చేశారు. కోడేరు, పానగల్, రేమద్దుల, వనపర్తి కోసం రామన్న గట్టు రిజర్వాయర్ శంకుస్థాపన చేయడం జరిగిందని, దీన్ని ఈ ప్రభుత్వం వచ్చాక పడావ్ పెట్టిందని చెప్పారు.

**అవసరం లేని గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ కోసం 1352 ఎకరాల భూసేకరణ చేయడం అవసరమా?**

ఏదుల రిజర్వాయర్ ప్రతిపాదన జరగక ముందు తాము గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ ప్రతిపాదన చేసిన మాట వాస్తవమేనని, ఏదుల రిజర్వాయర్ నిర్మాణం తర్వాత గొల్లపల్లి, చీర్కపల్లి రిజర్వాయర్ ప్రతిపాదనను విరమించుకున్న మాట వాస్తవమని అన్నారు. జీవోలు చదవకుండా మిడిమిడి జ్ఞానంతో మాట్లాడడం సిగ్గు చేటు అన్నారు. ఏది మాట్లాడిన తెలుసుకొని మాట్లాడాలని నోటికొచ్చినట్లు మాట్లాడితే గుణపాఠం తప్పదని ఆయన హెచ్చరించారు. అనివార్యం అయితేనే భూసేకరణ చేయాలని అప్పటి యూపిఏ ప్రభుత్వం చట్టం చేసిందని ఆయన గుర్తు చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, జగదీశ్వర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, మాణిక్యం,వనం రాములు, వేణు యాదవ్, రఘువర్ధన్ రెడ్డి,దొడ్ల రాములు,నాగన్న యాదవ్, వెంకట్ సాగర్, సూర్య వశం గిరి, చిట్యాల రాము, హేమంత్ ముదిరాజ్, జోహెబ్ హుస్సేన్, సయ్యద్ జెమిల్ తదితరులు పాల్గొన్నారు.

## అలనాటి మేటి గాయకులు ఏ. ఎం.రాజా

**ఏ.ఎం.రాజా పేరు ఈ తరానికి అంతగా తెలియక పోవచ్చు. ఒకనాడు దక్షిణ భారత సినీ నేపథ్య గాయకుడుగా, అలనాటి కథానాయకులకు అందరికి తన మధురమైన గొంతును అందిం చారు. కేవలం పాటలతో సినిమాల విజయవంతానికి చేయూత అందించారు. హిందీలో మొట్ట మొదట ప్లేబాక్ పాడిన దక్షిణ దేశ గాయకుడైన ఘనత ఏ.ఎం. రాజాదే. బహుత్ దిన్ హుయె (1952)లో పాడారు. తమిళ, తెలుగు సినిమా రంగాలలో విశిష్టమైన నేపథ్య గాయకులు, సంగీత దర్శకులు, నటుడు, ఏ.యం.రాజా 1950వ దశకంలో తమిళ, తెలుగు సినిమా రంగాలలో విశిష్టమైన నేపథ్య గాయకులు, సంగీత దర్శకులు, నటులు.**

రాజా కంఠస్వరం ప్రత్యేకమైనది. ఎక్కడ వినబడినా గుర్తించడం కష్టం కాదు. కాని అనుకరించడం మాత్రం సులభం కాదు. రాజా గళంలో ఒక వినూత్నమయిన సౌకుమార్యం, మార్దవం, మాధు ర్యం ఉండేది. ఆ ప్రత్యేకత వల్లనే సినిమారంగంలో రాజా మెల్లమెల్ల గా పైకెదిగారు. ఆయన సంగీత దర్శకత్వంలో ప్రాధాన్యత మెలడీకే ఇచ్చే వారు. రాసిలో తక్కువైనా వాసిలో ఏమాత్రమూ తక్కువ కానివి రాజా పాటలు.

ఏ. ఎం. రాజాగా సుప్రసిద్ధులైన ఏమల మన్మథరాజు రాజా 1929 సంవత్సరం జూలై 1వ తేదీన చిత్తూరు జిల్లాలోని రామచంద్ర పురంలో మన్మథరాజు – లక్ష్మమ్మ దంపతులకు పుట్టారు. పచ్చయప్ప కళాశాల నుండి 1951లో బీ. ఏ. పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. కళాశాలలో చదివేటప్పుడే ఎన్నో పాటల పోటీలలో పాల్గొని బహుమతులను పొందారు. మాస్టర్ నటరాజన్ వద్ద సంగీతా భ్యాసం పొందారు. రాజా స్వంతగా రాసి స్వరపరచిన రెండు పాటలను హెచ్.ఎం.వీ రికార్డు చేశారు. ఈ పాటలు ఆకాశవాణి 1951లో తరచూ ప్రసారం చేసేది. ఆయన పాడిన మొదటి రికార్డు 'ఎంత దూర మీ పయనం'. ఈ పాటలను విన్న జెమినీ స్టూడియో అధినేత వాసన్ తాను తమిళంలో నిర్మిస్తున్న సంసారం చిత్రంలో రాజాను పాడమన్నారు.



తమిళంలో సుసర్ల దక్షిణామూర్తి దర్శకత్వంలో సంసారం, సంసారం అనే పాట (తెలుగులో దీనిని ఘంటసాల పాడారు) రాజా పాడిన మొట్టమొదటి సినిమా పాట. తెలుగు లో ఆయన పాడిన మొదటి పాటలు 'ఆకలి' 'ఆదర్శం', 'సంక్రాంతి' (1952) చిత్రాలలోనివి. కానీ గాయకుడిగా గుర్తింపు పొందింది పక్కింటి అమ్మాయి (1953) సినిమాలో పాడిన పాటలతో.

రాజా సరదాగా నటించి, పాడిన హాస్యరస చిత్రం పక్కింటి అమ్మాయి. చిత్రంలోని గీతాలు హాయి గొలిపే లలిత గాన మాధుర్యానికి సంకేతాలుగా నిలిచా యి. అమర సందేశం గీతాలు కూడా రాజా శక్తిని నిరూపించాయి. శోభ, పెళ్ళి కానుక చిత్రాలకు, మరికొన్ని తమిళ చిత్రాలకు ఏ.యం.రాజా సంగీత దర్శకత్వం వహించారు.

అన్ని భాషలలో పాడుతున్నా, తెలుగు తమిళ సినిమాలలోనే రాజా ఎక్కువగా పాడేవారు. ఆ సమయంలోనే ఎం. జీ. రామ చంద్రన్ నటించిన 'జెనోవా' చిత్ర నిర్మాణ సమయంలో పీ. జీ. కృష్ణవేణిని (జిక్కి గా మనకు చిరపరిచితం ఆమె గాత్రం) చూడడం తటస్థించింది. ఇద్దరూ కలిసి సినిమాలలో యుగళ గీతాలు పాడేవారు. అలా ఆ పరిచయం ప్రేమగా మారింది. ఆ ప్రేమ అలా పెరిగి పాటలలోనే కాకుండా జీవితంలో కూడా భాగస్వాము లయ్యారు.

రాజా సంగీత జీవితపు ఆరంభ దశలో అతనికి ఎక్కువ ఖ్యాతిని తెచ్చినవి మూడు చిత్రాలు -- ప్రేమలేఖలు (1953), అమర సందేశం, విప్ర నారాయణ (1954). విప్రనారాయణ లోని చూడుమదే చెలియా' లాంటి, పాటలు ఇప్పటికీ ఏమాత్రం వన్నె తగ్గనివే. సుశీలతో పాడిన మిస్సమ్మ (1955) చిత్రంలోని బృందావనమది అందరిది గోవిందుడు అందరి వాడేలే ఒక మరపు రాని పాట. సంగీత ప్రధానమైన 'అమర సందేశం'లో ముఖ్యంగా చెప్పుకోవలసినవి ఆయన పాడిన రెండు సోలోలు: మధురం మధురం మనోహరం, ఆనతి కావలెనా గానానికి సమయము రావలెనా ఏనాటికీ మరిచి పోలేనివే..బంగారు పాప(1954), భాగ్యరేఖ(1957) చిత్రాలలో రాజా పాడిన పాటలు కూడా తీపి గుర్తులే. నేనూ ఒక మనిషినా (మేలు కొలుపు, 1956), అందాల రాణీ వీరకంకణం, 1957), తానేమి తలంచేనో (దాంపత్యం, 1957), ప్రభూ తొలిసంజ (సిపాయి కూతురు, 1959). ఇలా 1953-57 మధ్య కాలంలో రాజా నక్షత్రంలా ఒక వెలుగు వెలిగారు. ముఖ్యంగా ఒక రెండు సంవత్సరాల పాటు (1953 - 55) ఘంటసాల కంటే రాజా గాత్రానికే నిర్మాతలు, సంగీత దర్శకులు ప్రాధాన్యతనిచ్చారు. మద్రాస్ ఫిల్మ్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాజాను 1959లో అత్యుత్తమ సంగీత దర్శకునిగా గౌరవించింది.

రాజా గాయకుడు దర్శకుడు మాత్రమే కాదు, ఒక నటుడు కూడా. పక్కింటి అమ్మాయి (1953) చిత్రంలో రాజా నటనను అందరూ మెచ్చుకొన్నారు. ఇందులో ఒక విచిత్రమేమంటే, ఇదే పాత్రను హిందీ చిత్రంలో (పడోసన్, 1968) గాయక దర్శకుడు కిశోర్ కుమార్ వేయగా, మళ్లీ తీసిన (1976) తెలుగు చిత్రంలో ఈనాటి గాయక దర్శకుడు బాలసుబ్రహ్మణ్యం పోషించారు. ఆయన కన్యాకుమారి జిల్లాలోని ఒక గుడిలో సంగీతకచ్చేరి చేసి తిరిగి వస్తుండగా తిరునల్వేలి జిల్లాలోని వల్లియూరులో జరిగిన రైలు ప్రమాదంలో 1989, ఏప్రిల్ 9న మరణించారు.

**– రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

## ముల్లంగి మజ్జిగ పులుసు.. ఎలా చెయ్యాలంటే.?



**కావాల్సిన పదార్థాలు :**
పావుకిలో ముల్లంగి ముక్కలు, ఒక కప్పు పెరుగు, రుచికి తగినంత ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ కారం, అర టీ స్పూన్ పసుపు, అర టేబుల్ స్పూన్ అల్లం పేస్ట్, అర టేబుల్ స్పూన్ ఆవాలు, అర టేబుల్ స్పూన్ మినపప్పు, ఒక టేబుల్ స్పూన్ నూనె, కరివేపాకు, కొత్తిమీరను తీసుకోవాలి. ముందుగా ముల్లంగి బాగా కడిగి వాటిని ముక్కలుగా కట్ చేసుకుని ఒక గిన్నెలో పెట్టుకోవాలి. ఇక ఇప్పుడు ఒక ప్లేట్ లేదా ఒక పాత్ర తీసుకుని ఒక కప్పు పెరుగును తీసుకుని మజ్జిగ కవ్వంతో వాటిని తిప్పుకుని మజ్జిగలా చేసుకుని పక్కన పెట్టుకోవాలి.

ఇప్పుడు గ్యాస్ స్టవ్ వెలిగించి ఒక పెద్ద గిన్నెలో ముల్లంగి ముక్కలు, ఒక గ్లాస్ నీరు, అర టీ స్పూన్ పసుపు, రుచికి తగినంత ఉప్పు వేసి ఉడికించాలి. ముక్కలు మెత్తగా అయిన తర్వాత మజ్జిగను పోసి, సన్నని మంటపై మరిగించాలి.

ఇప్పుడు కొత్త పాన్ తీసుకుని కొద్దిగా నూనె వేసి, అర టీ స్పూన్ ఆవాలు, జీలకర్ర, నాలుగు ఎండుమిర్చి ముక్కలు, నాలుగు కరివేపాకు, 4 పచ్చిమిర్చి, అల్లం పేస్ట్ వేసి మిక్స్ అయ్యేలా కలుపుకోవాలి.

అంతే, వేడి వేడి ముల్లంగి మజ్జిగ పులుసు రెడీ. వేసవి కాలంలో ఈ ముల్లంగి మజ్జిగ పులుసును తాగితే వేడి మొత్తం తగ్గుతుంది. ఈ పులుసులో అర కట్ట కొత్తిమీర వేస్తే త్వరగా ఆహారం అరిగిపోయి కొద్దీ సమయంలోనే జీర్ణమవుతుంది



## దుమ్మురేపిన స్టాక్.. ఒకే రోజు రూ.2,300 పెరిగిన షేరు ధర.. ఇన్వెస్టర్లకు లాభాల పంట!




ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ మేఘాలు ప్రస్తుతానికి తొలగిపోవడంతో భారత స్టాక్ మార్కెట్లు రాకెట్‌లా దూసుకెళ్లాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన శాంతి ప్రకటన మార్కెట్లలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

ఈ సానుకూల పవనాలతో సెన్సెక్స్, నిఫ్టీలు రికార్డు స్థాయి లాభాలను మూటగట్టుకున్నాయి. ఏప్రిల్ 8 సెన్సెక్స్ 2,946 పాయింట్లు పెరిగి 77,563 వద్ద ముగిసింది. అదే నిఫ్టీ 873 పాయింట్లు (3.78%) ఎగబాకి 23,997 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ ఒక్కరోజులోనే రూ.16 లక్షల కోట్ల సంపద పెరిగింది.

**ఫోర్స్ మోటార్స్ ప్రభంజనం:**
మార్కెట్ జోష్‌కు తోడు అద్భుతమైన అమ్మకాల గణాంకాలతో ఆటోమొబైల్ దిగ్గజం ఫోర్స్ మోటార్స్ షేరు దుమ్మురేపింది. ఒక్కరోజే ఈ షేరు ధర ఇన్వెస్టర్లకు కళ్లు చెదిరే లాభాలను అందించింది. ప్రారంభ ధర: క్రితం ముగింపు రూ.19,920 కాగా, బుధవారం ఏకంగా రూ. 20,900 వద్ద ఓపెన్ అయింది. గరిష్ఠ స్థాయి: ఇంట్రాడేలో 12% పెరిగి రూ. 22,290 మార్కును తాకింది. ఇక ముగింపు: చివరికి 11.10% లాభంతో రూ. 22,131 వద్ద స్థిరపడింది. నికర లాభం: ఒక్కో షేరుపై ఒకే రోజు దాదాపు రూ. 2,211 నుంచి రూ. 2,350 వరకు పెరగడం విశేషం.



**ఎందుకీ దూకుడు?**

ఫోర్స్ మోటార్స్ షేరు ఇంతలా పెరగడానికి ప్రధాన కారణం కంపెనీ సాధించిన అమ్మకాల వృద్ధి. సేల్స్ గ్రోత్ 2025-26 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ దేశీయంగా 36,536 యూనిట్లను విక్రయించింది. వార్షిక వృద్ధి గత ఏడాదితో పోలిస్తే అమ్మకాలు 20 శాతం మేర పెరగడం ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచింది. మార్కెట్ సెంటిమెంట్ యుద్ధ భయాలు తొలగి, చమురు సరఫరా పునరుద్ధరణపై ట్రంప్ హామీ ఇవ్వడం ఆటో రంగానికి బూస్టునిచ్చింది.

ముఖ్య గమనిక: ఫోర్స్ మోటార్స్ 52 వారాల గరిష్ఠ ధర రూ. 26,450 కాగా, కనిష్ఠ ధర రూ. 8,300. ప్రస్తుతం ఈ సంస్థ మార్కెట్ విలువ రూ. 29.10 వేల కోట్లుగా ఉంది. ఇన్వెస్టర్లకు ముఖ్య గమనిక ఏంటంటే.. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. పెట్టుబడి పెట్టే ముందు నిపుణులను సంప్రదించడం శ్రేయస్కరం.

## వరుసగా రెండోసారి.. ఆర్‌బీఐ వడ్డీరేట్లలో మార్పుల్లేవ్





రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈమేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా బుధవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఆర్‌బీఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇదే.

ఫిబ్రవరిలో జరిగిన సమీక్షలోనూ ఈ వడ్డీరేట్లను ఆర్‌బీఐ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది.

**ఆర్‌బీఐ ప్రసంగంలోని కీలక అంశాలివే..**
ప్రపంచ ఆర్థికవ్యవస్థకు అనూహ్య సవాళ్లు ఎదురవుతున్నాయి. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయి.
2026-27 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.9 శాతంగా నమోదుకావొచ్చని అంచనా వేస్తున్నాం.
చమురు ధరల్లో పెరుగుదల ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 4.6 శాతంగా ఉండొచ్చు.
ఏప్రిల్ 3వ తేదీ నాటికి భారత ఫారెక్స్ నిల్వలు 696.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

## అమెజాన్‌లో మళ్లీ 14వేల లేఆఫ్‌లు..?

ప్రముఖ ఇ-కామర్స్ సంస్థ అమెజాన్ మరోసారి పెద్దఎత్తున ఉద్యోగులపై వేటు వేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది . వచ్చే నెలలో దాదాపు 14వేల మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ఆసియా బిజినెస్ అవుట్‌లుక్ వెల్లడించింది.




మేలో చేపట్టనున్న ఈ తొలగింపుల్లో అమెజాన్ వెబ్ సర్వీసెస్, రిటైల్‌తో పాటు మానవ వనరుల విభాగాలలోని ఉద్యోగులపై ప్రభావం పడనుందని నివేదికలు తెలిపాయి. అయితే ఈ విషయంపై అమెజాన్ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. 2025 చివరి నాటికి అమెజాన్ 14వేల ఉద్యోగులను తొలగించగా.. ఈ ఏడాది జనవరిలో 16వేల మందిపై వేటు వేసింది. ఇటీవల వేలాది మంది ఉద్యోగులను తొలగించిన కంపెనీల్లో ఒరాకిల్, మైక్రోసాఫ్ట్, టీసీఎస్, యాక్సెంచర్ ఉన్నాయి. మెటా సైతం 15వేలమంది ఉద్యోగులను తొలగించడానికి యోచిస్తున్నట్టు సమాచారం.

## విమానయాన సంస్థలకు కేంద్రం ఊరట



ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న దేశీయ విమానయాన సంస్థలకు ఊరట కల్పించేందుకు గాను కేంద్రం ఓ కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయ విమానాల ల్యాండింగ్, పార్కింగ్ రుసుములను 25 శాతం తగ్గించుకోవాలని దేశంలోని ప్రధాన విమానాశ్రయాలకు ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల పాటు ఈ తగ్గింపులు కొనసాగించాలని పేర్కొంది.

ఇరాన్ యుద్ధం నేపథ్యంలో దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థలైన ఇండిగో, ఎయిరిండియా లకు భారీ దెబ్బ తగిలింది. ఈక్రమంలో విమానాశ్రయాలు వసూలు చేసే కొన్ని రుసుములను తగ్గించేలా చూడమని ఆయా విమానయాన సంస్థలు కేంద్రాన్ని అభ్యర్థించాయి. ఈ క్రమంలోనే కేంద్రం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ ఆదేశాలపై స్పందించింది. ఈ తాత్కాలిక ఛార్జీల తగ్గింపు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది. కాగా.. అమెరికా- ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విమానయాన రంగం పుంజుకుంది. ఇందులోభాగంగా ఇండిగో షేర్లు ఈరోజు ఏకంగా 10శాతం పెరిగి.. అప్పర్ సర్క్యూట్‌ని తాకాయి.

# మహిళల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత

**తల్లిబిడ్డల ఆరోగ్యం కోసమే సేఫ్ మదర్ డేకు శ్రీకారం**

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** గర్భిణీ స్త్రీలు బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. బుధవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్ కార్యక్రమంలో మూడవ రోజు సేఫ్ మదర్ డే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన హాజరై మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు, బాలింతల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. సేఫ్ మదర్ డే కార్యక్రమం ద్వారా గర్భధారణకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయించు కోవాల్సిన వైద్య పరీక్షలపై అవగాహన పెంపొందుతుందని పేర్కొన్నారు. గర్భధారణ తర్వాత ప్రతి గర్భిణీకి సమయానికి వైద్య సేవలు అందించడం, పోషక




విలువలు కలిగిన ఆహారం అందించడం, పుట్టిన శిశువుకు తల్లిపాలు అందించడం ద్వారా తల్లి-బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లే దిశగా వెంటిలేటర్లు, సీటీ స్కాన్ యంత్రాలు ఏర్పాటు చేశామని, త్వరలోనే ఎంఆర్ఐ యంత్రాన్ని కూడా ప్రారంభించనున్నామని వెల్లడించారు. అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, ఇతర రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుండి కూడా ప్రజలు వైద్యసేవలకు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ తల్లి ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని, దాంతో ఆరోగ్యవంతమైన కుటుంబం, సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. వివాహానికి ముందు, తర్వాత, గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవసరమైన వైద్య పరీక్షలపై అవగాహన కల్పించడం సేఫ్ మదర్ డే ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న హెల్త్ వీక్ ద్వారా ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వైద్యులు గ్రామీణ స్థాయిలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, జిల్లా వైద్య శాఖ అధికారి మధుసూదన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజేంద్ర ప్రసాద్, కౌన్సిలర్లు, వైద్యులు, బాలింతలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాలవరం అంగన్వాడీలో ఆరోగ్య లక్ష్మి కమిటీ తొలి సమావేశం



**కోదాడ,ఏప్రిల్ 8(నినాదం):** అనంతగిరి మండలం పాలవరం గ్రామంలోని అంగనవాడి కేంద్రంలో బుధవారం ఆరోగ్య లక్ష్మి కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరియు చిన్నారుల పోషణపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్, గ్రామ సర్పంచ్ మట్టపల్లి నరేష్ గౌడ్ మాట్లాడుతూ , అంగనవాడి కేంద్రంలో అందిస్తున్న పోషకాహార నాణ్యత, సమయానికి పంపిణీ, శుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. అధికారులు గర్భిణీలు,బాలింతలు నిరంతరం అంగన వాడి సేవలను వినియోగించుకోవాలని సూచిస్తూ, పిల్లల ఆరోగ్యం మరియు పోషణపై తల్లిదండ్రులు మరింత శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అంగనవాడి టీచర్ సైదమ్మ, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ



**భూపాలపల్లి ఏప్రిల్8 (నినాదం):** భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలొ కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రారంభించిన ఈ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేసిన ఈ కేంద్రం ద్వారా జిల్లాలో నేర నియంత్రణ అధునాతన టెక్నాలజీ వినియోగంలో పోలీస్ శాఖ మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన భద్రత అందించడమే లక్ష్యంగా సీసీ కెమెరాల మానిటరింగ్ ఈ కేంద్రం ద్వారా నిర్వహించబడుతుందని జిల్లా ఎస్పీ అన్నారు ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ వెల్ఫేర్ ఆర్ ఐ సంతోష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## రాజకీయంలో నూతన వరవడిని సృష్టించిన యువ నాయకుడు

**దంతాలపల్లిలో ఘనంగా జననేత జన్మదిన వేడుకలు**

**డోర్నకల్ / దంతాలపల్లి ఏప్రిల్ 08(నినాదం) :** డోర్నకల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో కొనసాగించాలనే సంకల్పంతో, నియోజకవర్గంలో అడుగుపెట్టిన జననేత యువ దళపతి ప్రముఖ పారిశ్రామికవేత్త కిసాన్ పరివార్ వ్యవస్థాపకులు నానావత్ భూపాల్ నాయక్ జన్మదిన వేడుకలను దంతాలపల్లి మండల కోఆర్డినేటర్ మూడవత్ రవి నాయక్ ఆధ్వర్యంలో దంతాలపల్లి మండలంలోని తూర్పు తండా గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కూలీల సమక్షంలో నానవత్ భూపాల్ నాయక్ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఉపాధి హామీ కూలీలకు పండ్లను పంపిణీ చేశారు. కొద్ది కాలంలోనే ప్రజల మనసులను గెలుచుకున్న నాయకుడు భూపాల్ నాయక్ అని కొనియాడారు. అనంతరం దంతాలపల్లి ప్రభుత్వ వైద్య హాస్పిటల్లో గర్భిణీ స్త్రీలకు డాక్టర్ సమక్షంలో పండ్లను పంపిణీ చేయడం జరిగింది. హాస్పిటల్ వైద్యులు,సిబ్బంది పాల్గొన్నారు. డాక్టర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు తాజా పనులను పంపిణీ చేయడం సంతోషించదగ్గ విషయం అన్నారు. స్వచ్ఛంద సంస్థ వాళ్లు,ప్రముఖులు ప్రభుత్వ హాస్పిటల్ తమ జన్మదినాని జరుపుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఇలాంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వ హాస్పిటల్లో జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు బానోత్ బాలాజీ నాయక్,బానోత్ యాకుబ్ నాయక్,ప్రవీణ్,ఉపాధి హామీ కూలీలు ఇంకా తదితరులు పాల్గొన్నారు.



## లింగనిర్ధారణ చట్టరిత్యా నేరం

**స్కానింగ్ కేంద్రాలు నిబంధనలు పాటించాలే**

**జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూధన్**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలుపై జిల్లా సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఎవరైనా స్కానింగ్ కేంద్రాల్లో ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తే రూ.10 వేలు జరిమానాతో పాటు జైలు శిక్ష విధించబడుతుందని హెచ్చరించారు. అలాగే జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు కచ్చితంగా క్రింది సూచనలను పాటించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో పరికరాలను నిర్వహిస్తున్న వైద్యుల వివరాలు నమోదు చేయాలని, గర్భిణులకు సరిపడ కుర్చీలు, త్రాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. వైద్యుల వివరాలు, స్కానింగ్ రుసుములు గోడపై స్పష్టంగా ప్రదర్శించాలని, గర్భిణుల స్కానింగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేసి, వారి సంతకాలు తీసుకోవాలని సూచించారు. లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ ఆస్పత్రులు స్కానింగ్ కేంద్రాలు గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు లింగ నిర్ధారణ నిషేధంపై అవగాహన కల్పించాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు పూర్తిగా నిషేధితమని, ఇలాంటి అక్రమ కార్యకలాపాలను గుర్తించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిఓ డాక్టర్ శ్రీదేవి, డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ దేవేందర్, డాక్టర్ సుధాకర్ డాక్టర్ సంధ్య, ఎన్‌జీవో ప్రతినిధి శ్యాంప్రసాద్, డెమో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



## తహసిల్దార్‌ను సన్మానించిన సర్పంచ్




**మహాదేవపూర్ ఏప్రిల్ 8, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ తహసిల్దార్ గా నూతనంగా వచ్చిన సత్యనారాయణ స్వామిని స్థానిక గ్రామపంచాయతీ సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ ఆధ్వర్యంలో పాలకవర్గం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుంగల శ్రీజ, వార్డు సభ్యులు నయూమ్, అస్రార్, గడ్డం స్వామి, మొహమ్మద్, చంద్రశేఖర్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మున్సిపల్‌కో ఆప్షన్ సభ్యుల కోసం దరఖాస్తులకు ఆహ్వానం

**ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ చికినే శశిధర్**



**అమరచింత, ఏప్రిల్ 8, (నినాదం):** ఆత్మకూరు మున్సిపాలిటీలోని కో ఆప్షన్ సభ్యుల పదవుల కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మునిసిపల్ కమిషనర్ చికినే శశిధర్ బుధవారం తెలిపారు. ఈనెల 13 నుండి 21 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థులు దరఖాస్తు తో పాటు ఇంటి నెంబర్ ఆధార్ కార్డు, ఓటర్ ఐడి కార్డు ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్స్ పాస్పోర్ట్ ఫోటోస్ జతపరిచి మున్సిపల్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్



**అమరచింత, ఏప్రిల్ 8 (నినాదం):** ఆత్మకూరు మున్సిపాలిటీలోని పలు వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మునిసిపల్ కమిషనర్ చికినే శశిధర్ బుధవారం పరిశీలించారు. డ్రైనేజీలను పరిశీలించి పారిశుద్ధ్య కార్మికులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రతి వార్డులో డ్రైనేజీలను ఎప్పటికప్పుడు గమనించి శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన డంపింగ్ యార్డ్ ను పరిశీలించారు. అనంతరం తడి చెత్త పొడి చెత్త పై సిబ్బందికి అవగాహన కల్పించారు. పట్టణ ప్రజలు బాధ్యతతో తడి చెత్తను పొడి చెత్తను వేరుచేసి మునిసిపల్ వాహనంలో వేయాలని సూచించారు.

## అంగన్వాడీ టీచర్లకు చరవాణిలను అందజేసిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి




**మిర్యాలగూడ ఏప్రిల్8 (నినాదం):** మిర్యాలగూడ ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని 211 మంది అంగన్వాడీ టీచర్లలో 194మందికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం సిడిపిఓ రేఖల మమత సమక్షంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ 194 సెల్ ఫోన్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ లక్ష్యంతో ప్రభుత్వం సెల్ ఫోన్లు అందిస్తున్నదో ఆ లక్ష్యం నెరవేర్చాలన్నారు, సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీడీపీఓ మమత మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాలకు లబ్ధిదారులైన గర్భిణీలు, బాలింతలు, 6నెలల నుండి 3సంవత్సరాల చిన్నారులు, 3 సంవత్సరాల వయసు నుండి ఆరు సంవత్సరాల వయసున్న పిల్లల, కిషోర బాలికలకు సంబంధించిన ప్రతి డాటాను ఎన్హెచ్ టీఎస్ పోషణ ట్రాకర్ యాప్ లలో పొందపరచుట కొరకు సెల్ ఫోన్లు టీచర్లకు అందిస్తున్నారన్నారు. అనంతరం ప్రాజెక్ట్ పరిధిలో గల 211 అంగన్వాడీ కేంద్రంలోని అంగన్వాడీ చిన్నారులకు యూనిఫామ్ దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఎనిమిది సెక్టార్ల సూపర్వైజర్లు బి.రాధిక, ఎం.నాగమణి, నజీమాబేగం మహమ్మద్, వాణి, హేమాదేవి, పద్మ, నిహారిక, మిర్యాలగూడ మండలం, పట్టణ పరిధి టీచర్స్ అర్బన్ టీచర్స్, టీచర్స్ హెల్పర్స్ సీఐటీయు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొందు పార్వతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఇంద్రపల్లి సైదమ్మ, ప్రమీల, ఎఐటీయుసి అధ్యక్షులు పద్మ పాల్గొన్నారు. అదేవిధంగా దామరచర్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని టీచర్లకు సెల్ ఫోన్లు, పిల్లలకు యూనిఫామ్ అందించారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎన్. చంద్రకళ, సూపర్ వైజర్లు రాణి, రజితలున్నారు.

## నరసింహులగూడెంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం కోసం వినతి

**జిల్లా కలెక్టర్‌ను కలిసిన సర్పంచ్ ఇందిర నరసయ్య**

**త్వరలో ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ**

**మునగాల, ఏప్రిల్ 8(నినాదం):** మునగాల మండలం నరసింహుల గూడెం గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ కుంచం ఇందిర నరసయ్య జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో రైతులు సుమారు 400 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్న నేపథ్యంలో, వర్షాల ప్రభావం వల్ల నష్టం కలగకుండా, అలాగే రైతులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్పందించిన కలెక్టర్ వెంటనే మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడి, రెండు నుంచి మూడు రోజుల్లో గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులకు త్వరలోనే కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వరికి ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న సాగు చేస్తున్న నరసింహులగూడెం రైతులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మొగిలిచర్ల సీతారాములు, మాజీ సర్పంచ్ జూలకంటి కొండారెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి, వార్డు సభ్యుడు మొగిలిచర్ల రమేష్, రైతులు షేక్ దస్తగిరి, ఎస్.కె సైదా, గొల్లపూడి వీరబాబు, జూలకంటి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



## అధిక శబ్దం కలిగించే 72 ద్విచక్ర వాహనాల మాడిఫైడ్ సైలెన్సర్స్ ధ్వంసం

**క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక**

**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 8(నినాదం):** అధిక శబ్దం కలిగించే 72 వాహనాల మాడిఫైడ్ సైలెన్సర్స్ ధ్వంసం అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నల్లగొండ ఎస్పీ శరత్చంద్ర పవర్ హెచ్చరించారు. బుధవారం నల్లగొండ పట్టణంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనల అమలు శబ్ద కాలుష్య, వాయు కాలుష్యం నియంత్రణలో భాగంగా పర్యావరణ రక్షణ కొరకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగింది. గత కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ, ద్విచక్ర వాహనదారులు మాడిఫైడ్ సైలెన్సర్లు




ఉపయోగించి అధిక శబ్దాలతో సౌండ్ పొల్యూషన్ సృష్టిస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న నేపథ్యంలో చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పి మాట్లాడుతూఅలాగే తిరిగి మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగించినట్లయితే, అట్టి వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సును రద్దు చేసి, వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక శబ్దం కలిగించే సైలెన్సర్లను వినియోగించే వారిపై జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటూ, ఇలాంటి ప్రత్యేక డ్రైవ్‌లను కొనసాగిస్తారని తెలిపారు. జిల్లా ప్రజల సురక్షిత ప్రయాణం ప్రమాద నివారణ కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.అలాగే ఎవరైనా అధిక శబ్దం కలిగించే మాడిఫైడ్ సైలెన్సర్లు వినియోగిస్తున్నట్లు గమనించినట్లయితే, సమీప పోలీసు అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి, 2 టౌన్ సిఐ రాఘవ రావు,ట్రాఫిక్ సిఐ మహాలక్ష్మయ్య,1 టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, 2 టౌన్ ఎస్. ఐ సైదులు,రూరల్ ఎస్.ఐ సైదా బాబు, కనగల్ ఎస్. ఐ రాజశేఖర్ రెడ్డి,మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తప్పవు

**పెబ్బేరు ఎస్సై యుగంధర్ రెడ్డి హెచ్చరిక**



**పెబ్బేరు, ఏప్రిల్8 (నినాదం):** ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పెబ్బేరు ఎస్సై యుగంధర్ రెడ్డి హెచ్చరించారు. పెబ్బేరు మండలం తోమాలపల్లి గ్రామ సమీపంలో ఇసుక రవాణా జరుగుతున్న నేపథ్యంలో ఆయన సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లకు సంబంధించిన అనుమతులు, డ్రైవింగ్ లైసెన్సులు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. ఇటువంటి చర్యలను పోలీసులు సహించరని హెచ్చరించారు. ట్రాక్టర్ డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ, రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, చట్టాలను గౌరవిస్తూ అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఎస్సై యుగంధర్ రెడ్డి తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ



**కమలాపూర్ ఏప్రిల్ 8 (నినాదం) :** మండలంలోని ఉప్పల్ గ్రామంలో సర్పంచ్ మొండెద్దుల రమ నాగరాజు 5 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ బైరి శ్రీనివాస్ , ఉప సర్పంచ్ మేడిపల్లి సిధార్థ , వార్డు సభ్యులు మోతె రాజేష్, సముద్రాల సదయ్య, వెంగల ప్రియాంక రవీందర్, ఎర్రబెల్లి రజిత శ్రీధర్ రావు, బండారి హర్షవర్ధన్, పసునూటి రాణా ప్రతాప్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పూసల గణేష్, తాళ్ల శ్రీధర్, పసునూటి చంద్రమౌళి, మొండెద్దుల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**పెబ్బేరు, ఏప్రిల్8 (నినాదం):** రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెబ్బేరు పరిసర ప్రాంతాల రైతుల సౌకర్యార్థం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సంప్రదించి, పెబ్బేరు ప్రాంతంలో తొలిసారిగా ఈ కేంద్రాన్ని ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వం మొక్కజొన్నకు రూ. 2400 మద్దతు ధరను ప్రకటించిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. రైతులకు మరింత సహాయం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, తహసిల్దార్ సత్యనారాయణ రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ బార్ అసోసియేషన్ పదవుల ఎన్నికలకు ఒకొక్క నామినేషన్



**మిర్యాలగూడ ఏప్రిల్8 (నినాదం) :** మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎన్నికలు - 2026-2027 గాను వివిధ పదవులకు అఖరు రోజు గురువారం నామినేషన్లను ఆయా పదవులకు ఒకొక్కరే పోటీకి దిగడంతో కార్యవర్గం కానుంది. అసోసియేషన్ లో సుమారు 167 మంది న్యాయవాదులు సభ్యులుగా ఉన్నారు. అధ్యక్షులుగా గౌరు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా జంగిలి యల్లయ్య, ఉపాధ్యక్షులుగా ఇసరం కరుణాకర్, రెండో జాయింట్ సెక్రటరీగా కొంక వెంకన్న, రాయరపు భాస్కర్ కోశాధికారి రెడ్డిపల్లి సైదులు, మహిళా ప్రతినిధి బి.జ్యోతి, ఆటల కార్యదర్శి భూక్యా రమేష్ గ్రంథాలయ కార్యదర్శి రాయారపు భాస్కర్, కందిమళ్ల వెంకటరెడ్డి కార్యవర్గ సభ్యుల కోసం పెండ్యాల నరసింహారావు సకినాల వేలాద్రి, గాదె చంద్రశేఖర రెడ్డి జెయిని సుష్మిత, బంటు మహేష్ బొంగరాల నాగరాజు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించే అధికారులు పుట్లూరి పుల్లారెడ్డి, గొడ్డటి సాయికుమార్ యాదవ్, మన్నెం కామేశ్వర్ రెడ్డి కోసం నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు. మహిళ న్యాయవాదులు గణనీయంగా ఉన్న మహిళ ఉపాధ్యక్ష, సంయుక్త కార్యదర్శి పదవులకు నామినేషన్ వేయకపోవడం గమనార్హం.

# అత్యవసర వైద్య సేవల విభాగం వైద్యులకు
# త్వరితగతిన అందుబాటులోకి తేవాలి

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**

**నిర్మల్ ప్రతినిధి, ఏప్రిల్8 (నినాదం):** జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలోని అత్యవసర వైద్య సేవల విభాగాన్ని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, పట్టణంలోని జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణం చివరిదశలో ఉన్న అత్యవసర వైద్య సేవల విభాగాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఆసుపత్రి భవంతి నిర్మాణానికి సంబంధించి మ్యాపులను సంబంధిత అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన వివరాలు, ఇంకా చేపట్టవలసిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత వివిధ విభాగాలను పరిశీలించారు. శస్త్ర చికిత్సల గదులు, డయాలసిస్ కేంద్రం, ఐ.సి.యు, గైనిక్ విభాగం, ఎలక్ట్రికల్ యూనిట్, ఫైర్ సేఫ్టీ విభాగాలు పరిశీలించారు. మిగిలి ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవల నిమిత్తం అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం సమీపంలోని యుడిఐడి (సదరం) కేంద్రం, డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్ లు పరిశీలించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర వైద్య సేవల



విభాగం, రక్త పరీక్షల గది, తదితర విభాగాలు పరిశీలించారు. అన్ని రకాల రిజిస్టర్లను చూశారు. బ్లడ్ బ్యాంక్ ను తనిఖీ చేసి, రికార్డు పరిశీలించారు. రికార్డుల్లో ఇంతకుముందు బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తం పొందిన వారికి ఫోన్ చేసి, వివరాలు సరిపోల్చారు. రికార్డులు, రసీదులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ఈ తనిఖీలలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, తహసీల్దార్ రాజు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు



పట్టణంలోని గుల్జార్ మార్కెట్ ప్రాంతంలో గల బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స కొరకు రోగులకు సేవా దృక్పథంతో వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్, అధికారులు సౌమ్య, స్థానిక కౌన్సిలర్ తౌహిదుద్దిన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవం రాష్ట్ర స్థాయి అవార్డులు
## సాధించిన వైద్య బృందానికి అభినందనలు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**రాష్ట్ర స్థాయిలో4 అవార్డులు సాధించిన పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి**



**పెద్దపల్లి రూరల్, ఏప్రిల్8 (నినాదం):** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వైద్య విధాన పరిషత్ అవార్డుల్లో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి నాలుగు అవార్డులు సాధించిన సందర్భంగా,జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా ఆసుపత్రి వైద్య బృందాన్నికి ప్రత్యేకంగా అభినందించారు. ఈ అవార్డుల్లో భాగంగా సూపరింటెండెంట్, సివిల్ సర్జన్ అనస్తీషియా విభాగం డా.కే.శ్రీధర్ ప్రథమ అవార్డు అందుకున్నారు. అలాగే 3 వేలకుపైగా ఆరోగ్యశ్రీ కేసులు నిర్వహించి రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినందుకు రెండవ అవార్డు లభించింది.తెలంగాణ డయాగ్నస్టిక్ సేవల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించినందుకు మూడవ అవార్డు అందుకోగా, రేడియాలజీ విభాగం తరపున డా. సంధ్యారాణి నాలుగో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వైద్య బృందం తమకు లభించిన అవార్డులను జిల్లా కలెక్టర్కు చూపించారు. అనంతరం జిల్లా కలెక్టర్ తన చాంబర్లో సూపరింటెండెంట్ను, వైద్యులను,నర్సింగ్ సిబ్బందిని, పారామెడికల్ సిబ్బందిని,సపోర్టింగ్, సానిటేషన్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమని తెలిపారు.ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా నాణ్యమైన వైద్య సేవలను అందిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని వైద్య సిబ్బందిని ప్రోత్సహించారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న ఉచిత,నాణ్యమైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పశువులకు గాలికుంట వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి

**13వ వార్డు కౌన్సిలర్ సిద్ధ తిరుపతి**



**సుల్తానాబాద్, ఏప్రిల్ 08(నినాదం):** రైతులు తమ పాడి ఆవులు, గేదెలకుగాలి కుంట నివారణ టీకాలు తప్పని సరిగా వేయించాలని 13వ వార్డు కౌన్సిలర్ సిద్ధ తిరుపతి పిలుపుని చ్చారు. ప్రాథమిక పశు వైద్య కేంద్రం సుల్తానాబా ద్ ఆధ్వర్యంలో పశు వైద్యాధికారి రఘుపతి రెడ్డి నేతృత్వంలో పాడి ఆవులు, గేదెలకు ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమంలో భాగంగా బుధవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 13 వ వార్డులో గేదెలకు టీకాలు వేశా రు. ఈ సందర్భంగా కౌన్సిలర్ సిద్ధ తిరుపతి మా ట్లాడుతూ, పశు సంపదను పెంచుకునేందుకు ప్ర తి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు.పశువులకు సోకే వ్యాధులను ముందే గుర్తించడంవల్లపశువు ల యాజమానులకు నష్టంరాకుండాచూడవచ్చు న్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీ పశువులను గాలి కుంట వ్యాధి నుండి రక్షిం చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు బాసటగా నిలుస్తున్న సీఎం సహాయనిధి

**144 మంది లబ్ధిదారులకు రూ. 35 లక్షల చెక్కులు**

**అందజేసిన ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్**

**నిర్మల్ ప్రతినిధి, భైంసా: ఏప్రిల్8 (నినాదం):** పేదలకు వైద్య పరంగా సేవలు అందించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్లి అన్నారు.బుధవారం ఎస్. ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ లో నియోజకవర్గం లోని 144 మంది లబ్ధిదారులకు 35 లక్షల 50 వేల రూపాయల చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.తాను ఎమ్మెల్యే గా ఎన్నికైనప్పటి నుండి ఇప్పటి వరకు 4వేల మంది కి పైగా లబ్ధిదారులకు ముఖ్య మంత్రి సహాయ నిధి కింద సహాయం చేయడం జరిగిందన్నారు.అదే విధంగా నిమ్స్ ఆసుపత్రి లో వైద్య సేవల కోసం 400 మందికి ఎల్. వో. సి లు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రజలను ఆదుకోవడానికి తన నివాసం లో ప్రత్యేకంగా సీఎం సహాయ నిధి కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిం ద న్నారు. విద్యా వైద్యం సాగునీరు అందించడం ధ్యేయంగా తాను ముందుకు సాగుతున్నానని అందులో భాగంగానే ముఖ్య మంత్రి కి విన్నవించడం తో ముధోల్ నియోజకవర్గానికి 200 కోట్ల నిధులతో ఇంటిగ్రేటెడ్



పాఠశాలను నిర్మించుకోబోతున్నామన్నారు. బాసర లో అమ్మ వారి ఆలయానికి 225 కోట్లు రావడం ముఖ్య మంత్రి శంకు స్థాపన చేయడం అదృష్టంగా భావిస్తున్నాని అన్నారు కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు, నియోజకవర్గం లో ఆసుపత్రుల అభివృద్ధి, 28 ప్యాకేజీ కి నిధులు తెప్పించేందుకు కృషి చేస్తానని ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే తానూర్ కుభీర్ మండలాలు సస్యశామల ంగా మారుతాయన్నారు. కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి తో పాటు. పలువురు సీనియర్ నాయకులు, బిజెపి నాయకులు ఆయా గ్రామాల సర్పంచ్ లు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

**మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్**



**మంథని, ఏప్రిల్8 (నినాదం) :** మంథని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడలు ఆడుకునే క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా మున్సిపల్ పరంగా చర్యలు తీసుకుంటామని మంథని మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్ తెలిపారు. బుధవారం మంథని జూనియర్ కళాశాల మైదానంలో మార్నింగ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఓడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, కౌన్సిలర్లు మాచిడి రాజు గౌడ్ ,ఎల్లంకి వంశీధర్, పోతరవేన శ్రీలత క్రాంతి లను వారు సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ జూనియర్ కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. కళాశాల మైదానంలో ప్రతిరోజు ఉదయం వాకర్స్ తో పాటు మార్నింగ్ క్రికెట్ ఆడుకునే వారితో గ్రౌండ్ సందడిగా మారుతుందన్నారు. క్రికెట్ క్రీడ కూడా శరీరానికి మంచి వ్యాయామం ఇస్తుందని ప్రతిరోజు క్రికెట్ ఆడేవారు సంతోషంగా ఉంటారని అన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రౌండ్ ను శుభ్ర పరచడంతో పాటు క్రికెట్ పిచ్ పైన వాటర్ కొట్టించి శుభ్రపరుస్తామని తెలిపారు. మార్నింగ్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగం వెంకటనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో. ఉపాధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఆకుల అజయ్, సహాయ కార్యదర్శి డాక్టర్ రాజేంద్రప్రసాద్, కోశాధికారి రవికుమార్, కార్యవర్గ సభ్యులు కొండపర్తి నరేష్, సతీష్ కుమార్, రాజు తో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

## తల్లీబిడ్డల సంక్షేమమే సర్కారు ధ్యేయం

**మంచిర్యాల, ఏప్రిల్ 8 (నినాదం):** ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు చేయడం ద్వారా మాత శిశు సంరక్షణకు కృషి చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం సురక్షిత మాతృత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని మాత శిశు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఆర్.ఎం.ఓ. శ్రీధర్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు చేపడుతుందని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం జరుగుతుందని తెలిపారు. శుద్ధమైన త్రాగునీరు, నాణ్యమైన పోషక ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని, వ్యాధులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గర్భిణీల వివరాలు నమోదు చేసి సమయానుసారంగా చేసుకోవలసిన వైద్య పరీక్షలు, తీసుకోవలసిన ఆహారం, పాటించవలసిన



జాగ్రత్తలపై అవగాహన కల్పించి ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంపొందించడం జరిగిందని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆసుపత్రులు, సామాజిక ఆసుపత్రులు, ప్రభుత్వ ఆసుపత్రులు, పల్లె, పట్టణ దవాఖానాలు, ప్రభుత్వ వైద్య, నర్సింగ్ కళాశాలల ద్వారా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రహస్య స్థావరంలో పేకాట

**9 మందిని అదుపులోకి తీసుకున్న జూలపల్లి పోలీసులు**

**నగదు 21,320 స్వాధీనం**



**పెద్దపల్లి రూరల్ ఏప్రిల్8 (నినాదం) :** జూలపల్లి మండలం కొనరావుపేట్ గ్రామ శివారులోని హుస్సేన్ మియా వాగులో నిర్మానుష కాళీ స్థలంలో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు జూలపల్లి ఎస్.ఐ.సి.హెచ్.సనత్ కుమార్ తన సిబ్బందితో కలిసి మాటు వేసి,పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు.పట్టుబడ్డ పేకాట రాయిళ్ల నుండి రూ,21,320 రూపాయల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తున్నట్లు జూలపల్లి పోలీసులు తెలిపారు. అలాగే మండల పరిధిలోని గంజాయి,డక్స్,పేకాట లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని జూలపల్లి ఎస్.ఐ.సి.హెచ్.సనత్ కుమార్ హెచ్చరించారు.

## క్యాతనపల్లి చైర్ పర్సన్‌కి సన్మానం

**మంచిర్యాల, ఏప్రిల్ 8(నినాదం):** క్యాతనపల్లి చైర్ పర్సన్ గా సంధ్యారాణి ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టారు. బుధవారం బీ ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. మున్సిపాలిటీ ఆదర్శంగా తీర్చిదిద్దాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హైమద్ , బిఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు కాటం రాజ్ కుమార్ , బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు దగ్గుల మధు కుమార్, యువజన విభాగ సీనియర్ నాయకులు మహమ్మద్



సోహెల్ , మహమ్మద్ సాజిద్ పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం వీడితే.. ప్రాణాలు పదిలం

**జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు**



**మంచిర్యాల, ఏప్రిల్ 8 (నినాదం):** నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం శ్రీరాంపూర్ లోని కొత్త రోడ్ ఏరియాలో కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఎవరైన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి డివిజన్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వేసవి సెలవుల్లో ఊరికి వెళ్లేవారు విలువైన వస్తువులు ఇంట్లో ఉంచి వెళ్ళకూడదని తెలిపారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాల పాలై కుటుంబాలను రోడ్డు పాలు చేసుకోవద్దని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు హెల్మెంట్, సీటు బెల్ట్ ధరించాలని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నపడకూడదని పేర్కొన్నారు. రాంగ్ సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి నిర్లక్ష్యపు చర్యలే ప్రమాదాలకు కారణం అని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ మాట్లాడరాదని సూచించారు. లైసెన్స్ లు లేకుండా వాహనలు నడిపితే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. రహదారి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవా లని సూచించారు. వాహనాలు తనిఖీ చేయగా సరైన పత్రాలు లేని 20 వాహనాలకు ఫైన్ విధించారు.ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ అశోక్,ఎస్సై సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం రైల్వే స్టేషన్‌లలో పోలీసుల మెగా డ్రైవ్

**గంజాయి, డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం**

**గోదావరిఖని ఏప్రిల్ 8 (నినాదం):** రామగుండం ప్రాంతంలో నేరాల నియంత్రణకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. గంజాయి మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు రైల్వే స్టేషన్‌లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పోలీసుల ఆకస్మిక తనిఖీలు ప్రతి మూలలో నిఘా,రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి ఆదేశాల మేంకు సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ సంధ్యారాణి ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.ఈ తనిఖీలలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ కూడా పాల్గొన్నారు. స్నిఫర్ డాగ్స్‌తో కఠిన తనిఖీలు,నార్కోటిక్ ట్రైనింగ్ పొందిన స్నిఫర్ డాగ్స్, స్పెషల్ పోలీస్ టీమ్ సహాయంతో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు పూర్తిగా తనిఖీ చేశారు.

**ప్రత్యేకంగా :** పార్సెల్ సర్వీస్ కేంద్రాలు, రైల్వే బోగీలు, ప్రయాణికుల బ్యాగులు, అనుమానాస్పద పార్సిల్స్ అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే రైళ్లపై ప్రత్యేక ఫోకస్,మహారాష్ట్ర మరియు ఇతర ప్రాంతాల నుంచి రైల్వే




మార్గం ద్వారా గంజాయి రవాణా జరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. డ్రగ్ నెట్‌వర్క్‌పై కఠిన చర్యలు గంజాయి సాగు, రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు సస్పెక్ట్ షీట్లు ఓపెన్ నిరంతర నిఘా వంటి కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. విస్తృతంగా పాల్గొన్న పోలీస్ బృందం ఈ




ఆపరేషన్‌లో పలు పోలీస్ అధికారులు పాల్గొన్నారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఎస్ఐలు సంధ్యారాణి, రమేష్, వెంకటస్వామి, లచ్చన్న సర్కిల్ పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది ప్రజలకు హెచ్చరిక,మాదకద్రవ్యాల రవాణా, వినియోగం, సాగులో పాల్గొంటే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## ఆత్మహత్య యత్నం నుంచి మహిళను రక్షించిన పోలీస్ అక్కలు (నారీశక్తి)

**ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్**



**నిర్మల్ ప్రతినిధి, బాసర/ ఏప్రిల్ 8 (నినాదం):** నిజామాబాద్‌కు చెందిన ఒక మహిళ తన భర్తతో జరిగిన కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై ఇంటి నుండి వెళ్లిపోయింది. అనంతరం బాసర గోదావరి నదిలో ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించింది. ఈ విషయం తెలిసిన కుటుంబ సభ్యులు వెంటనే డయల్ 100కు సమాచారం అందించారు. డయల్ 100 సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన పోలీస్ అక్క (నారిశక్తి) బృందం సంఘటనా స్థలానికి చేరుకుని, అప్రమత్తంగా వ్యవహరించి ఆ మహిళను ఆత్మహత్య కు పాల్పడకుండా ప్రాణాలను కాపాడారు. అనంతరం మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,ఐపీఎస్ మాట్లాడుతూ.. సమయోచితంగా స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడిన పోలీస్ అక్కలను (నారిశక్తి) బృందాన్ని అభినందించారు. పోలీస్ అక్క (నారిశక్తి),మహిళల భద్రత కోసం మాత్రమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో కూడా ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించిన పోలీస్ అక్కలు దీపిక,సుమేర లను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు.

# వైద్య సేవల్లో సమయపాలన కీలకం

**జిల్లా కలెక్టర్ హరిత**

**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 8(నినాదం) :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. బుధవారం కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టికలు, వార్డులు, ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాలని వైద్యులకు సూచించారు. వేసవి దృష్ట్యా వడదెబ్బ బాధితులకు అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని, సాధారణ ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు ఆసుపత్రుల్లోనే ప్రసవాలు



చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మండల పరిషత్



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస సామర్థ్యాలను తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులు అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. తదుపరి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ధ్రువపత్రాల జారీని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, అధికారులు విధులకు సమయానికి హాజరై బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్, ఎంపీడీఓ ప్రవీణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించిన అధికారులు

### ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో ప్రత్యేక కార్యక్రమం

**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 8 (నినాదం)**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని షాపూర్ నగర్ నుండి జీడిమెట్ల బస్సు డిపో వరకు పాదచారులకు అసౌకర్యం కలిగించే విధంగా ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాలు, బోర్డులు, ఇతర ఆక్రమణలను తొలగించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను గాజులరామారం సిఎంసి అధికారులతో సమన్వయం చేసుకొని, పాదచారుల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్న ఆక్రమణలను తొలగించడం ద్వారా ఫుట్‌పాత్‌లను తిరిగి పాదచారుల వినియోగానికి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో పాటు సుమిత్ర, ఏసీబీ టౌన్ ప్లానింగ్, గాజులరామారం సిఎంసి, వారి సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు విషయాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

### రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్లగొండ ప్రతినిధి ఏప్రిల్ 8 (నినాదం)**

రబీ ధాన్యంకొనుగోలులో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు . బుధవారం మంత్రి నల్గొండ జిల్లా ,నల్గొండ, కనగల్ మండలాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం కనగల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి తనిఖీ చేసి ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. లారీల సమస్య ఉన్నట్లు నిర్వాహకులు మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే కాంట్రాక్టర్ తో మాట్లాడి కనగల్ మండల కేంద్రంలో అవసరమైన లారీలు ఏర్పాటు చేయాలని, ఎట్టి పరిస్థితులలో కొనుగోలు చేసిన ధాన్యం ఆగడానికి వీలులేదని, కనగల్ లో 6,జి ఎడవల్లిల్లో 8 లారీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎండాకాలమైనందున ధాన్యం తేమ శాతం లో ఎలాంటి ఇబ్బంది లేదని, అలాగే తాలు,తరుగు సమస్య కూడా లేనందున కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని, అవసరమైతే రాత్రి సమయంలో లైట్లు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేసి పంపించాలన్నారు. హమాలీల సమస్య లేకుండా చూసుకోవాలని చెప్పారు.ధాన్యం కొనుహులుకై జిల్లాలో ఐకెపి , పిఎసిఎస్ ల ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని, నల్గొండ ,మిర్యాలగూడ ప్రాంతంలో అత్యధికంగా ధాన్యం వచ్చే ప్రాంతాలలో వీటిని ప్రారంభించినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైస్ మిల్లర్లు సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి, పౌరసరఫరాల మంత్రితో మాట్లాడి పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు. అవసరమైతే లైట్లు ఏర్పాటు చేసి రాత్రి సమయంలో కూడా ధాన్యం కొనుగోలు చేసి త్వరగా ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని పునరుద్ఘాటించారు. .జిల్లా కలెక్టర్ ప్రతిరోజు ధాన్యం కొనుగోలు పై వీడియో కాన్ఫరెన్స్, టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు.వారి వెంట ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశం, జిల్లా సహకార అధికారి పత్యానాయక్ ,డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి ,మార్కెటింగ్ శాఖ ఏడి ఛాయాదేవి, మండలాల ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, తదితరులు మంత్రి వెంట ఉన్నారు.



# దిశ సమావేశంలో అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష

### ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామ సహాయం రఘు రామ్ రెడ్డి

### తాగునీరు, వైద్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి.. మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, ఏప్రిల్8 (నినాదం)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దిశా సర్వసభ్య సమావేశం బుధవారం జిల్లా కేంద్ర ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఎంపీ రామ సహాయం రఘు రామ్ రెడ్డి అధ్యక్షత వహించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ కో–చైర్మన్‌గా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ అంకిత్, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట రావు, కొత్తగూడెం మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్, అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, దిశా కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. సమావేశంలో గత దిశా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతి సమగ్రంగా సమీక్షించబడింది. ఎంపీ రామ సహాయం రఘు రామ్ రెడ్డి జిల్లా అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయాలని, ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పనుల పురోగతిని నివేదికల రూపంలో ఎప్పటికప్పుడు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులను వేగవంతం చేసి, గత నిర్ణయాలను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టంగా సూచించారు.

ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘు రామరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం లో భాగంగా గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇస్తుందని, ఇప్పుడు కేవలం 60 శాతం మాత్రమే ఇచ్చే విధంగా మార్పు వచ్చి, మిగిలిన 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. అదేవిధంగా గృహ నిర్మాణ శాఖలో అనేక మార్పులు రావడం వలన పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర చర్చ జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కీలకమని, ప్రతి పథకం లక్ష్యాలకు అనుగుణంగా లబ్ధిదారులకు సమయానికి ప్రయోజనాలు చేరేలా పర్యవేక్షణ పెంచాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి సరఫరా, వైద్య సేవలు, విద్యుత్ వంటి ప్రాథమిక సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. మణుగూరు, ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం తదితర ప్రాంతాల ప్రభుత్వ ఆసుపత్రుల పరిశుభ్రత, ఆహార నాణ్యత, మరుగుదొడ్ల నిర్వహణ, అంబులెన్స్, డయాలసిస్ సేవల విస్తరణ, సికిల్ సెల్ అనీమియా, హెచ్పీవీ వ్యాక్సిన్ అవగాహన కార్యక్రమాలపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి అని సూచించారు. మిషన్ భగీరథ, అమృత్ పథకాల కింద తాగునీటి సరఫరా మరియు పైప్‌లైన్‌లీకేజీలను తొలగించడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలలో త్రాగునీటి సరఫరా పనులను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు.

జాతీయ రహదారులు, ఆర్ & బి, విద్యుత్ శాఖల పనుల ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేసి, ఐటీడీఏ నిధులతో చేపట్టిన పనులలో ఆలస్యానికి కారణాలను వివరించాలని అధికారులు నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కేంద్ర నిధులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.

మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమగ్రంగా చర్చించి, అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, మారుమూల ప్రాంతాల వరకు త్రాగునీటి సరఫరా కల్పించాలని, ఆసుపత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయడం కోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. దిశా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రాధాన్యతగా తీసుకుని వాటి అమలును వేగవంతం చేయాలని, ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో చేరేలా పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని, పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా, వైద్య సేవలు, విద్యుత్ వంటి ప్రాథమిక సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, అశ్వరావుపేట మున్సిపల్ చైర్ పర్సన్ శశికళ, డి ఆర్ డి ఓ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి , కొత్తగూడెం ఆర్డీవో మధు, దిశా కమిటీ సభ్యులు బుర్ర సురేష్, యేసుమని, స్వర్ణ జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.










> శాసన సభ్యులు తమ నియోజకవర్గ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిపై అధికారులు సమగ్ర వివరణ ఇవ్వాలని కోరారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు తదితరులు తమ నియోజకవర్గాల్లో పథకాల అమలు స్థితిగతులపై అధికారుల నుంచి సవివర నివేదికలు కోరారు.

# వరి ధాన్యం కొనుగోలు సజావుగా నిర్వహించాలి

### ఇతర రాష్ట్రాల ధాన్యం కొనుగోలు చేస్తే కఠిన చర్యలు.. కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ హెచ్చరిక

**గద్వాల ప్రతినిధి ఏప్రిల్ 8 ( నినాదం)**


జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నుంచి కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, అవకతవకలకు పాల్పడే వారిపై సస్పెండ్ వేటు తప్పదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. బుధవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో రబీ సీజన్ కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 87 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈనెల 9వ తేదీ నుంచి కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రైతులు తాము పండించిన ధాన్యంను తమ కల్లాల వద్దే బాగా ఆరబెట్టుకుని వస్తే కొనుగోలు కేంద్రాల వద్ద ప్రత్యేకంగా ఆరబెట్టే అవసరం ఉండదన్నారు. ఈ విషయంలో సంబంధిత ఏఈవోలు అన్నదాతలకు అవగాహన కలిగించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని, వివిధ రిజిస్టర్ లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా వరి ధాన్యం కొనుగోలు మరియు మిల్లులకు రవాణా చేసిన వివరాల రిజిస్టర్లో ప్రతి అంశాన్ని పూరించాలని ఆదేశించారు. ధాన్యం రకం, మిల్లుకు పంపిన తేదీ, తేమశాతం, తదితర వివరాలన్నీ పక్కాగా నమోదు చేయాలన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశాక వారికి 24 గంటల్లోనే డబ్బులు వచ్చేలా అవసరమైన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆయా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు నిర్దేశించిన క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనాలని, ఇతర రాష్ట్రాల ధాన్యం కొనుగోలు చేస్తే బాధ్యులపై సస్పెండ్ వేటు తప్పదని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యం రాకుండా జిల్లాలోని ఎనిమిది చెక్ పోస్టుల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే ఫ్లెక్సీల పై జిల్లా, రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లను రాయించాలన్నారు. వేసవి నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులతో పాటు ఆయా కేంద్రాల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పౌర సరఫరాల జిల్లా అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, పాల్గొన్నారు.




## అల్లు అర్జున్ మూవీ రాకా!

### టైటిల్ రిలీజ్ చేసిన చిత్ర బృందం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ అందింది. తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ చేయబోతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'రాకా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ఫస్ట్ లుక పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదలైన పోస్టర్‌లో అల్లు అర్జున్ మునుపెన్నడూ చూడని విభిన్నమైన అవతారంలో కనిపిస్తున్నారు. గుండుతో, కళ్లకు కాటుక పెట్టుకుని, ఒంటిపై వింత ఆకృతులతో ఉన్న ఈ లుక చూస్తుంటే ఆయన ఏదో 'వేర్–బీస్ట్' (జంతువుగా మారే మనిషి) తరహా పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. 'జవాన్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. ఆమె ఈ చిత్రంలో ఒక వీరనారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సుమారు 800 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక హంగులతో రూపొందుతోంది. హాలీవుడ్ టెక్నీషియన్లు కూడా ఈ ప్రాజెక్ట కోసం పని చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం సహా 7 భాషల్లో 2027 వేసవిలో విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. 'విజన్ బియాండ్ లిమిట్స్' హద్దులు లేని ఊహ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




## ధురంధర్ దర్శకుడికి బాంబే హైకోర్టులో ఊరట



తన కథను కాపీకొట్టి ఆదిత్యధర్ 'ధురంధర్ 2'ని తెరకెక్కించారంటూ డైరెక్టర్ సంతోశ్‌కుమార్ చేసిన ఆరోపణలపై బాంబే హైకోర్టును ఆశ్రయించిన 'ధురంధర్' దర్శకుడు ఆదిత్యధర్‌కు స్వల్ప ఊరట లభించింది. తదుపరి విచారణ వరకూ ఆదిత్య గురించి ఏం మాట్లాడకూడదంటూ సంతోశ్‌కు న్యాయస్థానం సూచించింది. ఇలాంటి పునరావృతం కాకూదంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తదుపరి విచారణ ఈనెల 16న జరగనుంది. తన కథను కాపీకొట్టి ఆదిత్యధర్ 'ధురంధర్ 2'ని తెరకెక్కించారంటూ సంతోశ్ కుమార్ ఆరోపించారు. 'స్క్రీన్ రైటర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'లో తన స్క్రిప్టు రిజిస్టర్ అయి ఉందని, ఆదిత్యపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. తనపై సంతోశ్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, తన పరువుకు భంగం వాటిల్లేలా మాట్లాడుతున్నారంటూ ఆదిత్య ఇటీవల బాంబే హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా ఉపశమనం లభించినట్లైంది.

NINADAM CINEMA


## విమర్శకులకు దీపిక ఘాటు సమాధానం

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ నటించిన 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. అయితే, ఈ సినిమా విజయంపై రణ్‌వీర్ భార్య, నటి దీపికా పదుకొణె ఇప్పటివరకూ స్పందించకపోవడంపై విమర్శలు ఎదురయ్యాయి. తాజాగా ఈ ట్రోల్స్‌పై ఆమె తనశైలిలో సమాధానమిచ్చారు. ఒక ఇన్‌స్టా పేజ్‌లో 'దీపికా తన భర్త సినిమాను ఎందుకు చూడడం లేదు. దాని గురించి ఎందుకు మాట్లాడట్లేదు' అని పెట్టిన పోస్ట్‌పై ఆమె స్పందిస్తూ.. 'మీ అందరికంటే ముందే నేను ఆ సినిమాను చూశాను. ఈ విషయం మీకు తెలీదు. ఇప్పుడు చెప్పండి ఎవరు ఎవరిని విమర్శించాలి' అంటూ వ్యంగ్యంగా కౌంటర్ ఇచ్చారు. సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టనంత మాత్రాన తన భర్తకు మద్దతు ఇవ్వడం లేదని అనుకోవడం సరికాదని ఆమె ఈ రిప్లైతో స్పష్టంచేశారు. ఆదిత్యధర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం భారతీయ సినిమా చరిత్రలో రూ.1000 కోట్ల మార్కును దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. రణ్‌వీర్‌తో పాటు ఆర్.మాధవన్, అక్షరుఖన్నా వంటి స్టార్స్ నటించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది.



## పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న బైకర్

టాలీవుడ్ హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'బైకర్' బాక్సాఫీస్ వద్ద అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా, విడుదలైన ఐదు రోజుల్లోనే ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచే స్థాయిలో వసూళ్లు రాబడుతోంది. సాధారణంగా ఏ సినిమా అయినా వీకడేస్‌లో కలెక్షన్లు తగ్గుముఖం పడతాయి. కానీ 'బైకర్' విషయంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. రోజు రోజుకూ ఈ సినిమా పుంజుకుంటూ ముందుకు దూసుకెళ్తోంది. ముఖ్యంగా ప్రేక్షకుల నుంచి వస్తున్న పాజిటివ్ మౌత్ టాక్ ఈ చిత్రానికి పెద్ద ప్లస్‌గా మారింది. ఆన్‌లైన్ బుకింగ్స్ కూడా ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. సోమవారం రోజు బుక్ మై షోలో సుమారు 15.6 వేల టిక్కెట్లు అమ్ముడవ్వగా, మంగళవారం ఈ సంఖ్య 17.2 వేలకు పెరగడం విశేషం. భారీ పోటీ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ హై–ఓల్టేజ్ యాక్షన్ స్పోర్ట్స్ డ్రామాపై చూపిస్తున్న ఆసక్తి సినిమా విజయానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని దర్శకుడు అభిలాష్ రెడ్డి కంకర తెరకెక్కించగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మించింది. సినిమాలో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించగా, సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. అలాగే అతుల్ కుల్కర్ణి కూడా తన నటనతో ఆకట్టుకున్నారు. ఇక సంగీత దర్శకుడు జిబ్రాన్ అందించిన నేపథ్య సంగీతం ఈ సినిమాకు మరింత బలం చేకూర్చింది.



## ఎన్టీఆర్, నీల్ మూవీ షూటింగ్ రద్దు రూమర్స్

### వదంతులను తోసిపుచ్చిన చిత్ర బృందం



ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. పీరియాడిక యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. ఈ సినిమా షూటింగ్ రద్దు అయిందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఎన్టీఆర్ లుక్ విషయంలో గందరగోళం నెలకొన్న నేపథ్యంలో షూటింగ్ వాయిదా వేశారని టాక వినిపించింది. తాజాగా ఈ వార్తలపై నిర్మాణ సంస్థ క్లారిటీ ఇచ్చింది. 'సినిమాలో హీరో లుక్, దీని షెడ్యూల్ రద్దు అంటూ వస్తోన్న వార్తల్లో నిజం లేదు. ఈ సినిమా షూటింగ్ ప్లాన్ ప్రకారమే ముందుకుసాగుతోంది. ప్రస్తుతం ప్రిపరేషన్ గ్యాప్ తీసుకున్నారంతే. దయచేసి ఎవరూ రూమర్స్ సృష్టించొద్దు. అనధికారిక సమాచారాన్ని షేర్ చేయొద్దు. ఏమైనా మార్పులు ఉంటే మేమే తెలియజేస్తాం' అని పేర్కొన్నారు. 'దేవర' తర్వాత ఎన్టీఆర్... 'సలార్' తర్వాత ప్రశాంత్ నీల్ చేస్తోన్న చిత్రమిది. 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఎన్టీఆర్ సరసన ఇందులో రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.

## లవ్ ఇన్సూరెన్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్

విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి జంటగా నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా రూపొందింది. ఈ చిత్రాన్ని నయనతార తన బ్యానర్‌పై నిర్మించడం విశేషం. ఇటీవల ఈ సినిమా తమిళ ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ఈ ఈవెంట్‌లో దర్శకుడు విఘ్నేష్ శివన్ మాట్లాడుతుండగా, అనూహ్యంగా నయనతార స్టేజిపైకి వచ్చి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఆమె సడన్ ఎంట్రీతో అక్కడి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తన భార్యను స్టేజిపై చూసిన విఘ్నేష్ భావోద్వేగానికి గురయ్యాడు. కళ్లలో నీళ్లు తెచ్చుకున్న ఆయనను నయనతార దగ్గరికి వెళ్లి కౌగలించుకొని ఓదార్చింది. ఈ సన్నివేశం అక్కడున్నవారినే కాదు, అందరిని కూడా కదిలించింది. నయనతార తన భర్తకు ఇచ్చిన భావోద్వేగ మద్దతు చూసి ఫ్యాన్స్ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. 'రియల్ లైఫ్‌లో నిజమైన భాగస్వామ్యం ఇదే' అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతి శెట్టి జంటగా రూపొందిన చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఏప్రిల్ 10న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కాబోతోంది.



Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787